www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా...
తెలంగాణ । ఆంధ్రప్రదేశ్ సంపుటి: 1 । సంచిక: 26 హైదరాబాద్ మంగళవారం । 28-05-2024 పేజీలు: 8 । వెల: రూ।। 5






## కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- నేటి మధ్యాహ్నం 12 గంటలకు వాదనలు
- బెయిల్‌తో పాటు అరెస్ట్, రిమాండ్‌ను సవాల్ చేసిన కవిత
- కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేసిన ఈడీ, సీబీఐ


2 లో..



## పైరవీ చేసి పదవి తెచ్చుకోవడానికి మాది కాంగ్రెస్ పార్టీ కాదు

- కిషన్ రెడ్డి అనుమతితోనే సీఎంను కలిశా
- పౌరసరఫరా శాఖలో జరిగిన అవినీతి జరిగింది
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- ఉత్తమ్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నాడు
- కాంగ్రెస్ నేతలపై బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి ఫైర్

2 లో..



# ట్యాపింగ్ ఇలా చేశాం

## ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బయటపడ్డ సంచలనాలు

- బీజేపీ అగ్రనేతల ఫోన్లను ట్యాప్ చేసి కేసీఆర్‌కు ఇచ్చాం
- స్పై కెమెరాల కోసం ఢిల్లీకి టాస్క్‌ఫోర్స్ టీం
- బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయాలని కేసీఆర్ ఆదేశించారు
- మద్యం కేసులో కవిత అరెస్ట్ కాకుండా ప్లాన్ చేశాం
- కొంతమంది అసమర్థ అధికారులతో ప్లాన్ ఫెయిల్ అయింది
- కేసీఆర్‌తో ఉన్న అనుబంధం వల్ల ఇంతకన్న ఎక్కువ చెప్పలేను
- వాంగ్మూలంలో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు వెల్లడి

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మాజీ డీసీపీ రాధాకిషన్ రావు వాంగ్మూలంలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించి విస్తుపోయే అంశాలు వెల్లడించినట్టు తెలిసింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2022 అక్టో బర్‌లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన పుడు మునుగోడు ఉప ఎన్నికల్లో ఆయనను ఓడించా లని కేసీఆర్ భావించారని రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో తెలిపారు. దుబ్బాక, హుజురా బాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ

మిగతా 2 లో



## జూన్ 2న గ్రాండ్ సెలబ్రేషన్స్

### అత్యంత వైభవంగా రాష్ట్ర అవతరణ ఉత్సవాలు

- కార్యక్రమాల షెడ్యూల్ ప్రకటించిన సీఎస్ శాంతకుమారి
- గన్ పార్క్‌లో అమరవీరులకు సీఎం నివాళితో ప్రారంభం
- పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర గీతం ఆవిష్కరణ
- ట్యాంక్‌బండ్‌పై వివిధ కళారూపాలతో కార్నివాల్
- 5000 మంది పోలీసులతో బ్యాండ్ ప్రదర్శన
- 80 స్టాళ్లలో ఫుడ్, చేనేత, హస్తకళల వస్తువులు

**విశ్వంభర, హైదరాబాద్, మే 27 :** జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలియజేశారు. జూన్ 2 వ తేదీన ఉదయం గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధి కారులతో సి.ఎస్ శాంతికుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. డీజీపీ రవీ గుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీ.ఏ.డీ కార్యదర్శి రఘునందన్ రావు తదితర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, పరేడ్ గ్రౌండ్ లో ఉదయం

మిగతా 2 లో



# ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

- 68.65 శాతం ఓటింగ్ నమోదు
- పోలింగ్ సమయం దాటినా బారులుదీరిన ఓటర్లు
- పలుచోట్ల ఉద్రిక్తత.. నగదు పట్టివేత
- జూన్ 5న ఓట్ల లెక్కింపు

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో :** ఉమ్మడి నల్లగొండ -వరంగల్ - ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి పోలింగ్ శాతం 68.65 శాతంగా నమోద యింది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ క్యూలైన్లలో ఉన్న వారు ఓటు వేసేందుకు

మిగతా 2 లో

# దేశానికి ప్రాజెక్టులు, విద్యుత్‌ను ఇచ్చిందే నెహ్రూ

- పదేళ్లలో మోదీ ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా..?
- దేశంలో ఆస్తులు పోగు చేసింది కాంగ్రెస్సే..
- ఆ ఆస్తులను ధారదత్తమ్ చేస్తుంది మోదీ
- 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేయలేదా..?
- ఇదంతా బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లే చేశారా?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

2 లో..





## విచారణకు నటి హేమ డుమ్మా

- వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని సీసీబీకి లేఖ
- విచారణకు రావడానికి కొంత సమయం కావాలని అభ్యర్థన
- హేమ లేఖను పరిగణలోకి తీసుకోని అధికారులు
- మరో నోటీస్ ఇచ్చేందుకు సిద్ధమైన బెంగళూరు పోలీసులు
- ఇదే సమయంలో సోషల్ మీడియాలో వీడియో రిలీజ్ చేసిన హేమ
- తప్పు చేయకుండా ఉండటానికి మనం ఏమైనా దేవుళ్లమా? అంటూ వేదాంతం
- ఒక తప్పును కవర్ చేయడానికి వంద తప్పులు చేయాల్సి వస్తుందంటూ కామెంట్

**విశ్వంభర, హైదరాబాద్ :** బెంగళూరు రేవ్ పార్టీ కేసులో నిందితులను సీసీబీ అధికారులు సోమవారం నుంచి విచారించనున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అను మానితురాలిగా ఉన్న నటి హేమ విచారణకు డుమ్మా కొట్టింది. తాను వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని తెలి పింది. విచారణకు హాజరయ్యేందుకు తనకు కొంత సమయం కావాలని సీసీబీకి లేఖ రాసినట్లు సమాచారం. అయితే ఆ లేఖను పరిగణలోకి తీసుకో వడం లేదని సీసీబీ అధికారులు వెల్లడిం చారు. దీంతో

మిగతా 2 లో



# ట్యాపింగ్ ఇలా చేశాం

(మొదటిపేజీ తరువాయి)
అభ్యర్థులు గెలిచినందున మునుగోడులో ఎలాగైనా బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కేసీఆర్ ఉన్నట్టు రాధాకిషన్‌రావు తెలిపారు. ఈ సమయంలోనే పైలెట్ రోహిత్‌రెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేర్చుకోవాలని అగ్రనేతలను సంప్రదించినట్టు తెలిసింది. బీజేపీ చెక్ పెట్టేందుకు వారిపై సర్వేలెన్స్ పెట్టాలని కేసీఆర్, ఎస్ఐబీకి చెప్పినట్టు రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేల కొనుగోలు ట్యాపింగ్ ఎలా చేశామంటే..**

అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై తనతో చర్చించారని, బీజేపీ అగ్రనేతల ఫోన్‌లను ప్రణీత్‌రావు బృందం ట్యాప్ చేసినట్టు రాధాకిషన్‌రావు చెప్పారు. అలా ట్యాప్ చేసిన ఒక ఆడియో టేప్‌ను కేసీఆర్‌కు పంపినట్టు వెల్లడించారు. ఆ తర్వాతే కేసీఆర్ అందరినీ ట్రాప్ చేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో స్పై కెమెరాల కోసం టాస్క్‌ఫోర్స్ టీంను ఢిల్లీ పంపామని, ట్రాప్ చేయడానికి ఒకరోజు ముందే కెమెరాలను ఫామ్‌హౌస్‌లో అమర్చామని తెలిపారు. ఆపరేషన్ మొత్తం బాధ్యతను సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులకు అప్పగించామని రాధాకిషన్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే కొనుగోలు కేసు కోసం ప్రత్యేక దర్యాప్తు వేసి బీజేపీ అగ్రనేత బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయాలని కేసీఆర్ ఆదేశించినట్టు చెప్పారు. బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేస్తే ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కాకుండా బీజేపీ అగ్రనేతలతో చర్చలు జరుపుదామని అనుకున్నట్టు రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో వివరించారు. అయితే కొంతమంది అధికారుల అసమర్థతవల్లే సంతోష్‌ను అరెస్ట్ చేయలేకపోయామని తెలిపారు. పలువురు అధికారులను కేరళకు పంపించినా ప్రణాళికను విజయవంతం చేయలేదన్నారు. సంతోష్‌ను అరెస్టు చేయకపోవడంపై కేసీఆర్ అసహనం వ్యక్తం చేసినట్లు రాధాకిషన్‌రావు వివరించారు. కేసీఆర్‌తో ఉన్న అనుబంధం వల్ల ఇంతకంటే ఎక్కువ విషయాలను చెప్పలేనని రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు తెలిసింది.



# జూన్ 2న గ్రాండ్ సెలబ్రేషన్స్

(మొదటిపేజీ తరువాయి)
ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించడంతో పాటు, సందేశం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనితో పాటు, శిక్షణ పొందుతున్న 5000 మంది పోలీస్ అధికారులు బ్యాండ్ తో ఈ ప్రదర్శనలో పాల్గొంటారని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేసి హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాల చే తయారు చేసిన పలు వస్తువులతో పాటు నగరంలోని పేరొందిన హోటళ్ళచే ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే నగరపౌరులతో వచ్చే పిల్లలకు పలు క్రీడలతో కూడిన వినోద శాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ట్యాంక్ బండ్ పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శన తోపాటు లేజర్ షో ఏర్పాటుచేశామని శాంతి కుమారి వివరించారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్ జైన్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, నగర పోలీస్ అడిషనల కమిషనర్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, హెచ్ ఎండీఏ అడిషనల్ కమిషనర్ ఆమ్రపాలి కాటా తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏర్పాట్లను పర్యవేక్షించిన సీఎస్ శాంతకుమారి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. కార్యక్రమం నిర్వహించనున్న పరేడ్ గ్రౌడ్స్ ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభాప్రాంగణంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారలు సమన్వయంతో పనిచే యాలని ఆదేశించారు. స్టేజ్ ఏర్పాట్లు, బారికే డింగ్, సభాప్రాంగణంలో విద్యుత్, మంచినీటి సరఫరా, మైక్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్ ల ఏర్పాట్ల వివరాలను ఆయా శాఖల అధికా రులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, విఐపీ రాకపోకలకు అంతరాయం కలుగ కుండా చేపట్టబోయే చర్యల వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.



# దేశానికి ప్రాజెక్టులు, విద్యుత్‌ను ఇచ్చిందే నెహ్రూ

- పదేళ్లలో మోడీ ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా..?
- దేశంలో ఆస్తులు పోగు చేసింది కాంగ్రెస్సే..
- ఆ ఆస్తులను ధారదత్తమ్ చేస్తుంది మోడీ
- 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేయలేదా..?
- ఇదంతా బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లే చేశారా?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో, తెలంగాణలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయకుండానే ఇదంతా బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లే చేశారా? అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ పెంచితే... వాటిని ప్రైవేటువారికి బీజేపీ ధారాదత్తం చేసిందని విమర్శించారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరమన్నారు. నాగార్జునసాగర్, బాక్రానంగల్ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్సే అని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు సాగునీటిని అందించేందుకు జంట జలాశయాలు నిర్మించింది తమ పార్టీయే అన్నారు. సింగూరు, మంజీరా నీళ్లు బీజేపీ నేతలు తాగడం లేదా? అని నిలదీశారు. హైదరాబాద్‌కు వస్తోన్న తాగునీళ్లు కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల నుంచే వస్తున్నాయన్నారు. 17 ఏళ్ల నెహ్రూ కాలంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించామని, విద్యుత్ అందించామన్నారు. పదేళ్లలో ఒక్క ప్రాజెక్ట్ కూడా కట్టని ప్రధాని మోదీ ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. బీజేపీ ఈ పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు తెచ్చింది? ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? అని నిలదీశారు. బీజేపీ హయాంలో పెట్రోల్, డీజి ల్, బంగారం.. ఇలా అన్ని ధరలూ పెరిగాయని విమర్శించారు. పీసీసీ అధ్యక్ష పదవిని అడిగే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీలో మాత్రమే ఉంటుందన్నారు. బీజేపీలో ఢిల్లీకి వెళ్లి అడిగే స్వేచ్ఛ ఉండదని... ఇక బీఆర్ఎస్‌లో అయితే మరొకరికి అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో అయితే ఎవరైనా అడగవచ్చునని చెప్పారు.

# ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)
అవకాశం కల్పించారు. దీంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ 49.53 శాతం పోలింగ్ నమోదు కాగా.. 4 గంటల వరకూ దాదాపు 60 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల్లోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 605 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సాగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా.. ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ ఎమ్మెల్సీ ఉపపోరులో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి ప్రేమేం దర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఏనుగల రాకేష్‌రెడ్డి పోటీలో నిలిచారు. వీళ్లతో పాటు ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీల విధానాలను వ్యతిరేకించే వాళ్లంతా కూడా స్వతంత్రంగా బరిలో నిలబడ్డారు. ఈ ఎన్నికల్లో 3 ఉమ్మడి జిల్లాల పరిధిలో 4,63,839 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.




**ఓటేసిన ప్రముఖులు..**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, ఆయన భార్య మమత ఓటేశారు. అటు.. హనుమకొండలోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మఠంపల్లి మండల కేంద్రంలో హైస్కూల్‌లో నల్గొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, వరంగల్ కాశీబుగ్గలోని వివేకానంద కళాశాలలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, నల్గొండ డైట్ స్కూల్లో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హనుమకొండ తేజస్వీ పాఠశాలలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ కళాశాలలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, నల్లగొండ జిల్లా కేంద్రంలో స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజ్ లోని పోలింగ్ బూత్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి ప్రేమెందర్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**జూన్ 5న కౌంటింగ్**

ప్రాధాన్యత ఓటు పద్ధతి అయినందున బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ సాగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో అధికారులు ఇచ్చిన పైలెట్ రంగు పెన్నుతో ప్రాధాన్యత టిక్ చేశారు. ఇటీవల లోక్ సభ ఎన్నికల్లో ఎడమ చేతి చూపుడు వేలికి సిరా చుక్క పెట్టినందున ఈసారి ఎడమ చేయి మధ్య వేలికి సిరా చుక్క వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. మద్యం దుకాణాలు మూసేసి 144 సెక్షన్ విధించారు. సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసినప్పటికీ ఇంకా క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. జూన్ 5న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు చేపడతారు.



## పలుచోట్ల ఉద్రిక్తత

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్‌లో కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నార్కట్‌పల్లిలోని డోకూరు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నేతలు డబ్బులు పంచుతుండగా పట్టుకున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌పై దాడి చేశారు. ఈ తతంగాన్ని వీడియో రికార్డు చేస్తున్న మీడియా సిబ్బందిపైనా దాడికి దిగారు. కెమెరాలు, ఫోన్లు ధ్వంసం చేశారు. ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ నేతలు గ్రాడ్యుయేట్ ఓటర్లకు డబ్బులు పంచుతున్నారనే సమాచారంతో అశోక్ అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు నువ్వుఎవరంటూ అశోక్‌పై దాడి చేశారు. దీన్ని చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై కూడా కార్యకర్తలు దాడి చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. మహబూబాబాద్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం సమీపంలో ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులకు, ఓటు వేయాలని ప్రసన్నం చేసుకుంటున్న పార్టీ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. 200 మీటర్ల దూరంలో ఉన్నామని, మీకు ఇబ్బంది ఏంటి అని పోలీసులతో కొంతమంది వాగ్వాదానికి దిగారు. మరోవైపు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలేజీలో అధికారుల నిర్లక్ష్యం వహించారు. పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటేసేందుకు వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచలేదు. దీనిపై ప్రశ్నించిన వికలాంగులకు వింత సమాధానం ఎదురయ్యింది. వీల్ ఛైర్లు లేకపోతే మేమేం చేయాలంటూ సిబ్బంది సమాధానం ఇవ్వడం గమనార్హం. దీంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నల్లగొండ ఖమ్మం వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బైపోల్ లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బులు పంచుతున్నారని పోలీసులకు పక్కా సమాచారం వెళ్లింది. ఈ క్రమంలోనే పోలీసులు పోలింగ్ కేంద్రం ముందు తనిఖీ చేశారు. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజి పోలింగ్ కేంద్ర ముందు ఓటర్లకు డబ్బులు పంచుతున్న వారిని పట్టుకున్నారు. సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి ఓ వ్యక్తి వద్ద రూ. 10 వేల పట్టుకున్నారు.

# విచారణకు నటి హేమ డుమ్మా

(మొదటిపేజీ తరువాయి)
హేమకు మరో నోటీసు ఇవ్వడానికి పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. బెంగళూరు రేవ్ పార్టీ కేసులో తెలుగు, తమిళ సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తీగలాగితే డొంకంతా కదిలినట్లు ఈ కేసులో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. రేవ్ పార్టీలో 103 మంది పాల్గొనగా వారిలో 86మంది మాదకద్రవ్యాలు తీసుకున్నట్లు తేలిందని పోలీసులు ఇప్పటికే వెల్లడించారు. మరోవైపు ఈ కేసులో అరెస్టైన ఆరుగురు నిందితుల్లో ఐదుగురి బ్యాంకు ఖాతాలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో పొలిటికల్ లీడర్లు, ప్రముఖులతో లింకులు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. రేవ్ పార్టీ జరిగిన చోట ఏపీ మంత్రి కాకాని పేరుతో స్టిక్కర్ ఉన్న కారును పోలీసులు గుర్తించారు. దీంతో ఆ మంత్రి అనుచరుడు పూర్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.

**తప్పును ఒకప్పుకున్న హేమ.. వీడియో రిలీజ్**

బెంగళూరు రేవ్ పార్టీ కేసు అనేసరికి అందరికి మొదట గుర్తొచ్చేంది నటి హేమ. నిజానికి ఈ కేసు హేమ కారణంగానే ఇంత సంచలనంగా మారిందని చెప్పొచ్చు. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు ఆమె తీవ్రంగా ప్రయత్నించారు. రేవ్ పార్టీలో తాను లేనని నమ్మించేందుకు ప్రయత్నించారు. కానీ.. చివరికి ఆమె బ్లడ్ శాంపిల్స్‌లో డ్రగ్స్ తీసుకున్నట్టు తేలింది. దీంతో.. పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చారు. ఇవాళ విచారణకు హాజరుకావాల్సి ఉన్నా హాజరుకాలేదు. అయితే.. ఆమె ఓ సంచలన వీడియో రిలీజ్ చేశారు. తప్పు చేయడనప్పుడు దేనికి భయపడాల్సిన అవసరం లేదని ఆమె చెప్పారు. అలా చెబుతూనే.. తప్పు చేయకుండా ఉండటానికి మనం ఏమైనా దేవుళ్లమా? అని ప్రశ్నించారు. ఒక తప్పును కవర్ చేయడం కోసం వంద తప్పులు చేయాల్సి వస్తుంది. అందుకే.. తప్పు ఒప్పుకుంటే మంచింది. లేదంటే వంద అబద్ధాలు ఆడాల్సి వస్తుంది అని ఆమె చెప్పారు. అందుకే తాను హ్యాపీగా ఉన్నానని ఆమె చెప్పారు. థింక్ పాజిటివ్.. మనసులో ఏం పెట్టుకోవద్దన్నారు. ఎవరేమన్నా ఊరుకోవద్దని సూచించారు. ప్రస్తుతం హేమ తన ఫ్యాన్స్‌తో లైవ్‌లో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తప్పు చేయకుండా ఉండటానికి మనం ఏమైనా దేవుళ్లమా అని అన్నారంటే ఆమె డ్రగ్స్ తీసుకున్నట్టు ఒప్పుకుంటున్నట్టేనని చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు.

# కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**విశ్వంభర, ఢిల్లీ :** లిక్కర్ స్కాం కేసులో కవిత బెయిల్ పిటిషన్ మంగళవారానికి వాయిదా పడింది. బెయిల్ కోరడంతో పాటు అరెస్ట్, రిమాండ్ ను కవిత సవాల్ చేశారు. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ విచారణ చేపట్టగా.. సీబీఐ, ఈడీ కేసుల్లో దాఖలైన బెయిల్ పిటిషన్లపై మంగళవారం విచారణ జరగనుంది. కవిత తరఫున కూడా నేడు వాదనలు వినిపించే అవకాశం ఉంది. ఇప్పటికే కౌంటర్ అఫిడవిట్లను ఈడీ, సీబీఐ దాఖలు చేసింది. ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు విచారణ వాయిదా పడింది. ఇది ఇలా ఉంటే జ్యుడీషియల్ కస్టడీలో ఉండగానే కవితను ప్రశ్నించాలంటూ సీబీఐ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్ ను కోర్టు అంగీకరించింది. కానీ కవితకు మాత్రం తనకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. సీఆర్పీసీ నిబంధనల ప్రకారం సీబీఐ ప్రశ్నించాలంటే కవిత వాదన కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ తర్వాత కనీసం అరెస్ట్ వారంటే కూడా లేకుండానే సీబీఐ అరెస్ట్ చేసిందని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కౌంటర్ వాదనలు వినిపిస్తామని ఈడీ కోర్టుకు తెలిపింది.

# పైరవీ చేసి పదవి తెచ్చుకోవడానికి మాది కాంగ్రెస్ పార్టీ కాదు

- కిషన్ రెడ్డి అనుమతితోనే సీఎంను కలిశా
- పౌరసరఫరా శాఖలో జరిగిన అవినీతి జరిగింది
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- కాంగ్రెస్ నేతలపై బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్ :** పైరవీ చేసి బీజేపీ ఎల్పీ లీడర్ పదవిని తెచ్చుకోలేదని... అందరి సమన్వయంతో తనకు అవకాశం కల్పించారని తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. అయినా ఉత్తమ్ కుమార్ రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్ష పదవిని ఎలా తెచ్చుకున్నారో మాకు తెలియదా? అని విమర్శలు గుప్పించారు. సోమవారం ఆయన రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పైరవీ చేసి పదవి తెచ్చుకోవడానికి తమది కాంగ్రెస్ పార్టీ కాదన్నారు. అయినప్పటికీ తాను వారిలా దిగజారి ఆరోపణలు చేయలేనన్నారు. తాను తమ అధ్యక్షుడి అనుమతితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్‌పై మాట్లాడినప్పుడు స్పందించని ఉత్తమ్ కుమార్ రెడ్డి యూ ట్యాక్స్‌పై మాట్లాడినప్పుడు మాత్రం స్పందించారంటే ఎంతగా అవినీతి జరుగుతోందో అర్థం చేసుకోవచ్చునని వ్యాఖ్యానించారు. పౌరసరఫరా శాఖలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాము 19 ప్రశ్నలతో లేఖ రాస్తే ఒక్క ప్రశ్నకు మాత్రమే ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పారని విమర్శించారు. తాను చేసిన ఆరోపణలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.

## తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంపై
# చిత్రకారుడితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చ



**విశ్వంభర, హైదరాబాద్ మే 27 :** తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంపై చిత్రకారుడు రుద్ర రాజేశంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. హైదరాబాద్‌లో సోమవారం పలు నమూనాల ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. తుది నమూనాపై సీఎం పలు సూచనలు చేశారు. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది. కాగా, జూన్ 2న రాష్ట్ర అవతరణ ఉత్సవాల నేపథ్యంలో ప్రభుత్వం పలు మార్పులకు కసరత్తు చేస్తుంది.

## గాలివానకు ఇటుకలు కూలి మృతి చెందిన
# కుటుంబాలను పరామర్శించిన కేటీఆర్



**విశ్వంభర, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్ పేట్ డివిజన్ సాయినగర్ కాలనీలో గాలి వాన వల్ల ఇళ్లు రేలింగ్ కూలీ ఓ చిన్నారితో పాటు మరో వ్యక్తి మృతి చెందిన ఘటనపై బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. సోమవారం మధ్యా హ్నం రషీద్, బాలుడు సమద్ కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరే టర్లు శ్రీకాంత్, రాగం నాగేందర్ యాదవ్, స్థానిక నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, వాలా హరీష్‌రావు ఇతర బీఆర్ ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రమా దం జరిగిన తీరును బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు బీఆర్ ఎస్ పార్టీ పక్షాన రూ. లక్ష రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. అనంతరం మాట్లాడిన కేటీఆర్.. గాలి దుమారం వల్ల ప్రమాదం చోటుచేసుకోవడం విచారకరమని, మృతుల కుటుంబాలకు బీఆర్ ఎస్ పార్టీ అండ గా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు బీఆర్ ఎస్ పార్టీ పక్షాన పరిహారంగా లక్ష రూపాయల చొప్పున నగదు ప్రకటించారు. అకాల వర్షం, గాలివానకు ప్రాణాలు కోల్పో యిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# అదానీ గ్రూప్‌పై విమర్శలు...

- మోదీ, రాహుల్ గాంధీలపై కోర్టులో దావా
- స్టాక్ ఇన్వెస్టర్ సుర్జీత్ సింగ్ యాదవ్ పిటిషన్ దాఖలు
- భవిష్యత్తులో ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా నిలువరించాలని పిటిషన్
- నేతలు ఆరోపణలు చేయడం వల్ల ఇబ్బందులొస్తున్నాయ్
- మార్కెట్లో అదానీ గ్రూప్ స్టాక్స్ ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది



**విశ్వంభర, ఢిల్లీ :** అదానీ గ్రూప్‌పై ప్రధాని నరేంద్ర మోదీ, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. సుర్జీత్ సింగ్ యాదవ్ అనే స్టాక్ ఇన్వెస్టర్ దీనిని దాఖలు చేశారు. అదానీ గ్రూప్‌పై లేదా అదానీ ప్రమోటర్ గౌతమ్ అదానీపై భవిష్యత్తులో వీరు ఎలాంటి వ్యాఖ్యలు చేయ కుండా నిలువరించాలని పిటిషన్‌లో పేర్కొన్నా రు. రాజకీయ నేతలు ఆరోపణలు చేయడం వల్ల స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్ స్టాక్స్ ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నాయని పేర్కొ న్నారు. దీంతో ఆ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టిన తన లాంటి ఎంతోమంది ఇన్వెస్టర్లకు నష్టం జరుగుతోందన్నారు. గౌతమ్ అదానీ సహా పలువురు పారిశ్రామికవేత్తలకు కేంద్రం రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారని... కానీ అందు లో వాస్తవం లేదన్నారు. మరోవైపు, అదానీ, అంబానీ నుంచి కాంగ్రెస్ పార్టీ ముడుపులు తీసుకున్నదని తెలంగాణలో ఎన్నికల ప్రచారం సందర్భంగా మోదీ ఆరోపించారన్నారు. ఇన్వె స్టర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎలాం టి ఆరోపణలు చేయకుండా నిలువరించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# హనుమాన్ జయంతి ఏర్పాట్లను పూర్తి చేయాలి




**విశ్వంభర, జగిత్యాల టౌన్ :** కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 30 నుండి జూన్ 1 వరకు హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.ఎస్. దివాకర తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఈనెల 29 లోగా ఉత్సవాల ఏర్పాటును పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 30 వ తేదీన భద్రాచలం నుండి వచ్చే పట్టువస్త్రాలను శోభయాత్ర ద్వారా కళాకారులచే కార్యక్రమాల ద్వారా స్వామి వారికి అలంకరించడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు సుమారు లక్షన్నర మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని 14 కౌంటర్లను ఏర్పాటు చేసి సుమారు 4 లక్షల ప్రసాదలను అందుబాటులో జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో 64 సిసి కెమెరాలు ఉండగా అదనంగా 50 సి. సి. కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, 6 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. కోనేరు వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్నానం ఆచరించే వీలు ఉన్నందున ఎప్పటికప్పుడు నీటిని శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను, భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను, 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఏ రకమైన సమస్యలు తలెత్తకుండా ఆలయ అధికారులు, ఉద్యోగులు, తాత్కాలిక ఒప్పంద ఉద్యోగులు సమన్వయం చేసుకుంటూ షిఫ్టుల వారీగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సిఇఓ రఘువరన్, డిఎస్పీ, రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈఓ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, కలెక్టరేట్ ఏఓ హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నోటీసుల పేరుతో బిల్డర్లకు వేధింపులు

### స్థానిక నాయకులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది కుమ్మక్కు



**విశ్వంభర, అంబర్‌పేట, మే 27 :** నియోజకవర్గం జీహెచ్‌ఎంసీ సర్కిల్ -16 టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా.. చిన్న చిన్న సాకు చూపించి తరచూ నోటీసులు జారీ చేస్తూ వేధిస్తున్నారని పలువురు బిల్డర్లు వాపోతున్నారు. స్థానిక ఓ ప్రజా ప్రతినిధి జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సర్కిల్-16 అధికారులు, కిందిస్థాయి సిబ్బంది కుమ్మక్కై ముడుపుల కోసం బిల్డర్లను నానా ఇబ్బందులకు గురిచేస్తూ.. బెదిరిస్తున్నారని నియోజకవర్గం పరిధిలోని శివం రోడ్డు బతుకమ్మ కుంట ఎదురుగా భవన నిర్మాణాన్ని చేపడుతున్న ఓ బిల్డర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసూళ్ల కోసం ఓ ప్రజా ప్రతినిధి తన ఇద్దరు అనుచరులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి, టౌన్ ప్లానింగ్ కిందిస్థాయి సిబ్బంది కుమ్మక్కై విచ్చలవిడిగా వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. డబ్బుల కోసం నోటీసులు జారీ చేస్తూ వేధిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల, సిబ్బందిపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి శాఖ పరమైన చర్య తీసుకోవాలని కోరుతున్నారు.



# తెలంగాణలో త్వరలో బీర్లు !?




పవర్ 10000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ ఇవేవో మందుల పేర్లు కావు. తెలంగాణలో త్వరలో దర్శనం ఇవ్వనున్న బీర్ల పేర్లు. సోమ్ డిస్టిలరీస్ అనే సంస్థ ఈ కొత్త బీర్లు సరఫరా చేయడానికి అనుమతి పొందినట్లు సమాచారం.

# దర్జాగా బెల్టుషాపుల నిర్వహణ పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)మే 27 :** ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో మద్యం షాపుల బందుతో మండలంలో గల్లి గల్లీకో బెల్ట్ షాప్ నడుస్తున్నాయి. అబ్కారి అధికారుల కనుసన్నల్లో బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు ఏదేచ్ఛగా మూడు బీర్లు ఆరు కోటర్లుగా అన్న చందంగా వ్యాపారం సాగుతున్నది. ఇంకా విచిత్రం ఏమిటంటే వైన్ షాపులో దొరకని మద్యం బ్రాండ్ల బీర్లు బెల్ట్ షాపుల్లో దొరుకుతున్నాయి. అదే స్థాయిలో కల్తీ మద్యం ఏరులై పారుతుంది. ఒక బీర్ ఎమ్మార్పీ కన్నా 40 నుంచి 50 రూపాయలు క్వాటార్ మద్యానికి 30 నుంచి 40 రూపాయలు ఎక్కువగా వసూలు చేస్తున్నారు. వాడకో మద్యం అమ్మే బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నా.. వాటిపై చర్యలు శూన్యం.

# గాంధీభవన్‌లో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రు వర్ధంతి



**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రు వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో నెహ్రు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ వి. హనుమంత రావ్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మేధావుల సెల్ చైర్మన్ శ్యామ్ మోహన్, నిరంజన్, కుమార్ రావ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు తదితరులు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నెహ్రు ప్రతిష్టను తగ్గించేందుకు ఆర్ఎస్సెస్, బీజేపీలు ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. పండిట్ జవర్ లాల్ నెహ్రు దేశాన్ని దూర దృష్టితో చూసిందని పేర్కొన్నారు. నెహ్రూను విమర్శించే వాళ్ళను చూసి నిజమైన దేశ భక్తులు ఇప్పుడు బాధ పడుతున్నారని అన్నారు.

# నకిలీ కరెన్సీ అంతర్జాతీయ ముఠా గుట్టు రట్టు!

### పోలీసుల అదుపులో ఆరుగురు ?

**విశ్వంభర, విజయవాడ క్రైం మే 27:** నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్న ముఠా వ్యవహారం రట్టయింది. ఈ ముఠాలోని ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లి, సీతానగరంకి చెందిన ముఠా నకిలీ కరెన్సీ చెలామణి చేస్తుంది. ఈ ముఠా రూ.లక్ష అసలు నోట్లు ఇస్తే రూ. 3 లక్షల విలువైన నకిలీ నోట్లు ఇస్తామని తెలంగాణలోని మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన వారితో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు శనివారం మిర్యాలగూడలో అసలు నోట్లు తీసుకుని కారులో విజయవాడ బయలుదేరిన వారిని తాడేపల్లి ముఠా వెంబడించింది. విజయవాడ సమీపంలోని సూరాయిపాలెం వద్దకు వచ్చి ఇరు వర్గాలు మాట్లాడుకుంటున్నారని సమాచారం. ఈ క్రమంలో ఆకస్మికంగా పోలీస్ స్టిక్కర్ ఉన్న తెల్లటి స్కార్పియో కారులో కొందరు వ్యక్తులు వచ్చి పోలీసుల పేరుతో హడావుడి చేశారు. ఈ వ్యవహారాన్ని స్థానికులు గుర్తించి ప్రశ్నించడంతో పోలీసుల పేరుతో హడావుడి చేసినవారు మరి కొందరు బెలేనో కారును వదిలిపెట్టి స్కార్పియో కారులో పారిపోయారు. దీంతో కంగుతిన్న మిర్యాలగూడ వాసులు ఏం చేయాలో పాలుపోక తాము ఆస్పత్రికి వెళుతుండగా వెంబడించి దోపిడీకి ప్రయత్నం చేశారని ప్లేటు ఫిరాయించినట్లు సమాచారం. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి నకిలీ పోలీసులు వదిలి వెళ్లిన కారును స్టేషన్ కు తరలించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసిన పోలీసులు నకలీ కరెన్సీ వ్యవహారం గురించి తెలుసుకున్నారు. మిర్యాలగూడ వారు తప్పుడు సమాచారం ఇచ్చారని గుర్తించారు. మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిలో గతంలో నకిలీ కరెన్సీ కేసులో అరెస్టు అయిన ఓ నిందితుడు కూడా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ కేసును నీరుగార్చేందుకు గతంలో విజయవాడ సీసీఎస్ లో పని చేసిన ఓ ఏఎస్ఐ విశ్వప్రయత్నాలు చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రతీకార హత్య

- వాహనంతో వెనుక నుంచి గుద్ది..
- తాడును మెడకు బిగించి.. ఆపై పెట్రోల్ పోసి..
- యువకుడిని చంపిన నిందితులు
- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** సరిగ్గా ఏడాది క్రితం హత్య కేసులో నిందితుడైన యువకుడిని సరిగ్గా అదే నెలలో ప్లాన్ చేసి పక్కాగా హత్య చేశారు. వాహనంతో వెనుక నుంచి గుద్ది బలవంతంగా కారులోకి ఎక్కించుకుని దూర ప్రాంతానికి తీసుకెళ్లారు. ఆపై తాడును మెడకు బిగించి చంపేశారు. మృతదేహాన్ని మాయం చేసేందుకు అక్కడే పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. చివరికి కటకటలాపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని రామచంద్రాపురానికి చెందిన నందికొండ వెంకన్న(26) ఈనెల 23న సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతడి ఆచూకీ గురించి వెతకగా, అతడి మోటారు సైకిల్ రాయిన్‌గూడెం గ్రామం పరిధిలో దొరికింది. దీంతో వెంకన్న తండ్రి నందికొండ సైదులు సూర్యాపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. దర్యాప్తులో భాగంగా మూడు టీమ్‌లను రంగంలోకి దించి కేసును ఛేదించారు. సదరు యువకుడు నందికొండ వెంకన్న హత్యకు గురయినట్టుగా పోలీసులు తెల్చారు. అసలు విషయంలోకి వెళితే..

### హత్య జరగడానికి కారణం హత్యే..

నందికొండ వెంకన్న 2022 సంవత్సరంలో తన స్నేహితుడైన బెజవాడ రాజశేఖర్‌ను డబ్బు వివాదం విషయంలో హత్య చేశారు. ఈ విషయంలో కట్టంగూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన వెంకన్న తనకు బెజవాడ రాజశేఖర్ కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహానీ ఉందని టేకుమట్ల గ్రామంలోని తన పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే రాజశేఖర్ హత్యకు ప్రతీకారంగా రాజశేఖర్ సొంత అన్న బెజవాడ రమేశ్ ప్లాన్ చేశారు. దీంతో నందికొండ వెంకన్న మరో స్నేహితుడు ఖమ్మంపాటి సైదులుతో కలిసి టేకుమట్ల గ్రామంలో ఉంటున్న వెంకన్నను హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారు. కానీ సాధ్యం కాలేదు.

### తమ్ముడిని చంపిన సరిగ్గా ఏడాదికి..

తన సోదరుడు బెజవాడ రాజశేఖర్‌ను మే 2022లో చంపారని, అదే నెలలో ఎలాగైన హత్య చేయాలని భావించారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 21న బెజవాడ రమేశ్, ఖమ్మంపాటి సైదులు రెక్కీ నిర్వహించి వెళ్లారు. అనంతరం ఈనెల 23న నందికొండ వెంకన్నను ఎలాగైనా చంపాలని బెజవాడ రమేశ్, ఖమ్మంపాటి సైదులు కలిసి బెజవాడ రాజశేఖర్ సొంత బాబాయి బెజవాడ జానయ్య, బోడ సతీష్ కుమార్, ఇస్లావత్ సురేశ్‌కు విషయం చెప్పారు. దీంతో వారు సరేనని చెప్పడంతో ఉదయం 8.15 గంటల సమయంలో టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద బెజవాడ జానయ్య, ఇస్లావత్ సురేశ్‌లు నందికొండ వెంకన్న కోసం ఎదురుచూశారు. ఆ సమయంలో నందికొండ వెంకన్న యాక్టివా వాహనంపై సూర్యాపేటకు వెళుతుండగా, వెనుక నుంచి ఫాలో అయ్యి రాజుగారి తోట హోటల్ వద్ద ఎదురుగా వచ్చి మహేంద్ర వాహనంతో ఖమ్మంపాటి సైదులు ఢీకొట్టాడు. దీంతో వెంకన్న రోడ్డు పక్కన పడిపోయాడు. వెంటనే వెంకన్నను బలవంతంగా వాహనంలోకి ఎక్కించుకుని మోతే గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. అక్కడ వెంకన్న మెడకు తాడును బిగించి చంపేశారు. అక్కడే ఉన్న కర్రలను శవంపై వేసి పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈ కేసును ఛేదించిన సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐ వై.సురేందర్ రెడ్డి, ఎస్ఐ ఎన్.బాలునాయక్, సిబ్బందిని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హేగ్డే అభినందించారు.






# నట పరిపాలనా సార్వభౌముడు

# నందమూరి తారకరాముడు

## మే 28.. ఎన్టీఆర్ జయంతి


**తెలుగువారు "అన్నగారు" అని అభిమానంతో, ప్రేమతో, ముద్దుగా పిలుచుకునే నందమూరి తారక రామారావు, అటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో మకుట రహిత మహారాజుగా ఖ్యాతిని ఆర్జించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. నటనకే పరిమితం కాక, పలు చిత్రాలను నిర్మించి, మరి ఎన్నింటికో దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు. సినీ కళామతల్లి సేవలతో పాటు, ప్రజా సేవ కూడా చేయాలని నిర్ణయించుకొని, రాజకీయ పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది మాసాల్లో నే ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించి, హస్తానికి అధికారాన్ని గతం చేసి, తెలుగుదేశం పక్షాన హస్తగతం చేసుకున్నారు. మూడు విడతలుగా ఏడు సంవత్సరాల పాటు అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రిగా పని చేశారు.**

### పట్టుదలకు, క్రమశిక్షణకు మారుపేరు

పట్టుదలకు, క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగు భాషకు, తెలుగు జాతికి, దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి, అఖిలాంధ్ర అందాల నటుడు నందమూరి తారక రాముడు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో చిరస్మరణీయునిగా వెలుగొందారు ఆయన. ఎన్టీఆర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు"గా ఖ్యాతిగాంచారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సుయోధనుడు రావణుని వంటి పౌరాణిక పాత్రల తో బాటు వైవిధ్య భరిత సాంఘిక, జానపద చిత్రాలలో విభిన్న పాత్రలను పోషించారు. సాటిలేని మేటిగా "చిత్రసీమ రారాజుగా భాసిల్లిన స్థితప్రజ్ఞులు రామారావు, 33 ఏళ్ల సినీ ప్రస్థానంలో, 13 చారిత్రక, 55 జానపద, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాలతో పాటు పలు తెలుగు, తమిళ చలన చిత్రాలలో విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది మాసాల కాల వ్యవధి లోనే, అప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా పగ్గాలు చేత బుచ్చుకుని, ఎనిమిదేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు.

### వివాహం, సినిమాలు..

1923 మే 27న కృష్ణాజిల్లా పామూరు మండలం నిమ్మకూరులో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతుల కు జన్మించి, తారక రాముని"గా నామాంకితులై, విజయవాడ మున్సిపల్ స్కూల్లో, తర్వాత ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో చదివారు. "కవి సామ్రాట్" విశ్వనాథ సత్య నారాయణ తెలుగు భాష ఉపాధ్యాయునిగా రామారావుకు "ఆడ వేషం" వేసే అవకాశం కల్పిస్తే, మీసాలు తీయకనే నటించి, "మీసాల నాగమ్మ" పిలువబడ్డారు. విద్యాభ్యాస సమయంలో ఆస్తి హరించుకు పోగా, కొద్ది రోజులు పాల వ్యాపారం, కిరాణా షాపు,



ఒక ముద్రణాలయాన్ని నడిపారు. 1942 లో మేన రికంగా బసవ తారకంను వివాహ మాడారు. నాటి ప్రఖ్యాత నటులు "కొంగర జగ్గయ్య, రక్త కన్నీరు నాగ భూషణం, కె.వి.ఎస్. ముక్కామల" లాంటి నటులతో "నేషనల్ ఆర్ట్ థియేటర్" నాటక సంస్థను స్థాపించారు. తర్వాత కాలంలో సదరు సంస్థ కొన్ని చిత్రాలు కూడా తీసింది. జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ మోహన కృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ, కుమారులు కాగా, పురంధరేశ్వరి, భువనేశ్వరి, ఉమా మహేశ్వరి కూతుళ్ళు కలిగారు. 1947 లో పట్టభద్రులై మద్రాసు సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి 1100 మందికి, ఏడుగురిలో ఎంపికై సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం పొంది, తన కార్యక్షేత్రం సినీ రంగంగా ఎంచి, ఉద్యోగాన్ని వదిలారు. ప్రముఖ సినీ నిర్మాత బి.ఎ.సుబ్బారావు రామారావును మద్రాసు పిలిపించి, "పల్లెటూరి పిల్ల" చిత్రంలో కథానాయకుడి పాత్రను 116 రూపాయల పారితోషకం అందించారు. అయితే 1949 లో విడుదలైన "మన దేశం" ఎన్టీఆర్ కెమెరా ముందు నిలిచిన తొలి చిత్రం అయింది.

### తెలుగుదేశానికి బీజం పడింది ఇక్కడే..

1978లో రాష్ట్ర కాంగ్రెస్ లో కుమ్ములాటలు, ఐదేళ్ల లో నలుగురు సీఎంలు మారడం, ఢిల్లీలో అధిష్ఠాన నిర్ణయానుసారం, సీఎంలు ఎన్నుకోబ డిన సాంప్రదాయం, కాంగ్రెసు ప్రతిష్టను దిగజార్చడం జరిగింది. ఈ క్రమంలోనే 1982 మార్చి 21న హైదరాబాద్ కు చేరి, మార్చి 29 సాయంత్రం, రాజకీయ పార్టీని స్థాపించనున్నట్లు ప్రకటించి, "తెలుగు దేశం" అని పేరు ఖాయం చేశారు. తన "చేవ్రోలెట్" కారునే "చైతన్య రథం"గా మార్పించి, దానిపై నలు మూలలా ఆంధ్రదేశ మంతటా పర్యటించి, ప్రచారం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో, ప్రజల మనోభావా లను ప్రభావితం చేసి "ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఆత్మగౌ రవ పునరుద్ధరణ" పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి సర్వం తానే అయి, ప్రజాకర్షణతో, ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ప్రసంగాలతో ప్రజా మద్దతు పొందారు. 1983 జనవరి 7న ప్రకటిత శాసన సభ ఫలితాలలో, 199 స్థానాలను సునాయా సంగా గెలుచుకొని, 97 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయ గలిగారు. టిడిపి వ్యవస్థాపక నేతలలో ఒకరైన నాదెండ్ల భాస్కర్ రావు, 1986 ఆగస్టు 16న, నాటి దేశ ప్రధాని ఇందిర, ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ రాంలాల్ సహకారంతో, ఎన్టీఆర్ ను పదవీచ్యుతుని గావించి, అధికారం హస్తగతం చేసుకోగా, ప్రజాస్వామ్య పునరు ద్ధరణ ఉద్యమ ఫలితంగా, సెప్టెంబర్ 16న తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ తిరిగి ముఖ్య మంత్రి అయినారు.

### ఎన్నో సంస్కరణలకు నాంది

ఎన్టీఆర్ ఎందరో ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు రాజకీయ జీవితాలను ప్రసాదించారు. విడి పోయిన తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి నారా బాబునాయుడు, దివంగత ఎన్టీఆర్ మంత్రివర్గంలో పని చేసిన వారే కావడం విశేషం. 1985 జూన్ 1న శాసన మండలి రద్దు, హుస్సేన్ సాగర్ కట్టపై ప్రసిద్ధుల విగ్రహాల ఏర్పాట్లు, సినిమా థియేటర్లకు స్లాబ్ విధానం, 1989 లో మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దు పరచి, కొత్త మంత్రి మండలి ఏర్పాటు, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు లో కీలక పాత్ర, రెండు రూపాయల కిలో బియ్యం పథకం, సంపూర్ణ మద్య నిషేధం, స్త్రీలకు ఆస్తిలో వాటా 1991 నంద్యాలలో గౌరవ సూచకంగా, నాటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు పోటీ పెట్టక పోవడం, 1989... 1994 మధ్య ప్రతిపక్ష పార్టీ నేతగా వ్యవహరించడం, 1993లో లక్ష్మీపార్వతిని వివాహ మాడటం, ఆమె సహచర్యం, తారకరాముని రాజకీయ ప్రస్థానంలో, ముఖ్యాతి ముఖ్య అంశాలుగా మిగిలాయి. ముప్పైమూడేళ్ళ తెర జీవితం లోను, పదమూడేళ్ళ రాజకీయ నాయకుడిగా వెలిగిన చిరస్మరణీ యుడు ఎన్టీఆర్ 1996 జనవరి 18న 73 సంవత్సరాల వయసులో గుండెపోటుతో మరణించారు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల,**
**9440595494**


---

## తెలుగు ప్రజలకు వరం

# సురవరం

## మే 28... సురవరం ప్రతాపరెడ్డి జయంతి

అవి తెలుగు భాషను గుర్తించని, స్థానిక ప్రాంతీయ భాషకు విలువలేని, తెలుగు భాషలో చదువు కోవడానికి కూడా సౌకర్యాలు అంతగా లేని రోజులు. నిజాం పాలకుల నిరంకుశ పాలనలో సామాజిక చైతన్యం దాదాపు శూన్య స్థితిలో స్తబ్దంగా ఉన్న సమయం. తెలంగాణ ప్రాంతంలో అధికార భాష ఉర్దూ మాధ్యమంలో చదువులు సాగడం, ఉర్దూ లోనే ప్రభుత్వ, వ్యావహారిక కార్యక్రమాలు కొనసాగడం, చదువుకున్న వారు ఉర్దూ చదవటం ఒక హోదా చిహ్నంగా ప్రజలు భావించే కాలం. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహార భాషగా ఉర్దూ ఉండగా, ఉర్దూ భాషలోనే మీజాన్, జామీన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. అప్పటికి రెండు తెలుగు వార పత్రికలు మాత్రమే 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడు తుండేవి. అలాంటి నిజాం రాజ్యంలో, ప్రతికూల వాతావరణంలో తెలుగు పత్రికని స్థాపించడమే ఓ సాహసం. ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషలు రాజ్యమేలుతున్న నిజాం రాజ్యంలో తెలుగు సాహిత్యం నిలదొక్కుకునేందుకు 'గోలకొండ పత్రిక' బీజం వేసింది.



హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి. మాతృ భాషలో చదువుకొనే అవకాశాలు లేక అంతా ఉర్దూమయమై, నిజాం నిరంకుశ పరిపాలనలో, నిద్రాణ స్థితిలో ఉన్న తెలంగాణను జాగృతం చేయాలన్న సురవరం దీక్ష ఫలితమే...1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభ నేపథ్యం. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడు తుండేది. పత్రిక నిర్వహణలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేశారు. 1947 లో అది దినపత్రికగా మారింది. నిజాంను తన పత్రికలలో ఏకిపారేస్తూ దూకుడుగా వ్యవహరించేవారు సురవరం. ఒక దశలో నిజాం రాజు గోలకొండ సంపాదకీయాలకు భయపడ్డారంటే... ఆయన కలం నిజాం ను ఎంత కలవర పరిచిందో అర్థం చేసుకోవచ్చు.

పత్రిక ఆదర్శాలను గురించి వివరిస్తూ ప్రతాపరెడ్డి ఒక సంపాదకీయంలో... "మేము మా పత్రిక స్థాపన కాలం నుండియు రెండంశములు దృష్టి పథమందుంచు కొని దేశీయులకు సేవ చేయు చున్నాము. మొదటిది ఆంధ్రాభాషా సేవ, రెండవది జాతి, మత, కుల వివక్షత లేక ఆంధ్రులలో సర్వశాఖల వారి యొక్క సత్వరాభి వృద్ధికై పాటుపడుట".

1896 మే 28 తేదీన జన్మించిన సురవరం కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు, వ్యాకరణం చదువు కొన్నారు. నిజాం కాలేజీలో ఎఫ్.ఎ. మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలో బి.ఏ. చదివిన తర్వాత బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాని ఎంతో కాలం ఆ వృత్తిలో ఉండలేక పోయారు. గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆయనను ఆకర్షించింది. తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయారు. భావుకుడైన రచయితగా, సురవరం కథలు నిజాం కాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించినవి.

1924లో హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమితులై, ప్రతాపరెడ్డి హాస్టల్ విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి వారిని చైతన్య వంతులను కావించి, నాటి కొత్వాల్ అయిన రాజా బహదూర్ ఆశీస్సులతో 1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రికను ప్రారంభించారు. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేసారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. కార్యాకలాపాలన్ని తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు. 1951 లో ప్రతాపరెడ్డి పులిజాల హనుమంతరావు తో కలిసి 'ప్రజావాణి' దినపత్రికను స్థాపించి రెండేళ్ళు నడిపారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి పట్ల ప్రగాఢమైన అభిమానం ఉండేది. ప్రజలలో విజ్ఞాన వికాసానికి గొప్ప రచనలు చేశారు. తెలంగాణా ప్రజల భాషనుకాని, సంస్కృతినిగాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. తెలంగాణలో తెలుగు కవులు లేరన్న ముడుంబ వెంకట రాఘవాచార్య వ్యాఖ్యలకు స్పందించి, 354 మంది తెలంగాణ కవుల పరిచయాలతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక'ను విడుదల చేశారు సురవరం.

---

## చైనా వన్ రోడ్–వన్ బెల్ట్

# భారత్ వ్యూహం చాబహార్



**– కన్నోజు శ్రీహర్ష**
**8985130032**



ప్రపంచంలో ఆర్థిక పోటీ విపరీతంగా పెరిగింది. ప్రపంచంలో ప్రస్తుతం బహుళ దేశాల పోటీ తత్త్వం నెలకొన్న నేపథ్యంలో చైనా దేశం మరింతగా దూకుడుగా వ్యవహరిస్తుంది. 1990 వరకు కేవలం రెండు దేశాలు రష్యా అమెరికాల మధ్య వున్న పోటీ.. ఈరోజు చాలా దేశాలు పోటీ పడుతున్నాయి. వీటిలో ప్రధానంగా భారత్, కెనడా, జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా తదితర దేశాలు పోటీపడుతున్నాయి. మారుతున్న ప్రపంచ రాజకీయాల దృష్ట్యా ఈ దేశాలు ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యతం కోసం పోటీ పడుతున్నాయి. ఈ క్రమంలో చైనా చాకచక్యంగా వ్యవహరిస్తూ ఆసియాలోనే కాక , హిందూ మహా సముద్రం చుట్టూరా వున్న దేశాల్లో కూడా చైనా పెత్తనం కొనసాగించాలని ప్రయత్నం చేస్తుంది. దీనికి తోడు, ప్రపంచంలోనే ఆర్థిక వ్యవస్థగా మొదటి స్థానంలో వున్న అమెరికాను దాటి సుమారు 17 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయ ఉత్పత్తికి చేరుకునే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఆశయ సాధనతోనే భాగంగా చైనా వన్ బెల్ట్ – వన్ రోడ్ ప్రాజెక్టును నిర్మిస్తుంది.

వన్ బెల్ట్ వన్ రోడ్ అనగా, బెల్ట్ అంటే రహదారి మార్గం, రోడ్ అంటే సముద్ర మార్గం. పూర్వం 2000సంవత్సరాల క్రితం రోమన్ చక్రవర్తుల, చైనీయుల మధ్య ఆర్థికంగా వ్యాపార లావాదేవీలు భారీగా జరుగుతుండేవి. అప్పట్లో దీనిని సిల్క్ రోడ్ అని కూడా అనేవారు. ఈ రోడ్ మార్గాన ఎంతో మంది రాజులు, చక్రవర్తుల, రాయబారులు ప్రయాణించి వ్యాపారాలు చేసేవారు. కొంతకాలం తరువాత దేశాల యొక్క భౌగోళిక స్వరూపాలు మారిపోవడంతో వివిధ దేశాల మధ్యనున్న ఈ రహదారి మార్గం కూడా మరుగున పడింది.

ప్రపంచంలో దేశాలు అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు, రహదారి మార్గాలు, రైల్వేలు, పారిశ్రామిక రంగం ముఖ్యం. చైనా దేశం ఇందుకు తగిన ప్రణాళికలను రూపొందించుకుంది. 2013 లో చైనా ప్రభుత్వం మూసుకుపోయిన నాటి సిల్క్ రోడ్డును తిరిగి బెల్ట్ అండ్ రోడ్ ప్రతిపాదనలకు సిద్ధం చేసుకుంది. సుమారు 70 దేశాల గుండా విస్తరించే ఈ భారీ ప్రాజెక్టును 6 నుంచి 8 ట్రిలియన్ డాలర్ల ఖర్చు ( 600 నుండి 800 లక్షల కోట్లు) తో చేపట్టడానికి సిద్ధమయ్యింది. దీనిని ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ డెవలప్ మెంట్ (ఏ.ఐ.ఐ.బి.) బ్యాంకు ద్వారా రుణాలతో పాటుగా చైనా తన డబ్బులతో ఈ భారీ ప్రాజెక్టును చేపడుతున్నది. రహదారి మార్గంగా సముద్ర మార్గంగా కలుపుకుంటే ఆఫ్రికా, ఆసియా, యూరప్ ఖండాల మీదుగా 70 దేశాలను కలుపుతూ ఈ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. రహదారి మార్గం గుండా చైనా నుంచి మాస్కో, లండన్ తూర్పు ఐరోపా దేశాలను కలపడం ద్వారా చైనా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. రవాణా వ్యవస్థ కూడా సులభతరం అవుతుంది. ఈ మార్గం పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా వెళ్లడం ద్వారా భారత్ విముఖత వ్యక్తం చేసింది. దీనిని చైనా పాకిస్తాన్ ఎకనమిక్ క్యారిడార్‌గా చైనా పాకిస్తాన్ ప్రభుత్వాలు పేర్కొంటున్నాయి. సముద్ర మార్గం గుండా వివిధ దేశాలను కలుపుతూ వేసిన వన్ రోడ్ ప్రణాళికతో హిందూ మహాసముద్రంలో చైనా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి స్ట్రింగ్ అఫ్ పల్స్ (ముత్యాల దండ)పేరుతొ ముందు కెళ్తోంది. ఎల్లో సీ, తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రం, హిందు మహా సముద్రం కలుపుతూ తూర్పు పశ్చిమ దేశాలను కలుపుతూ అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా పశ్చిమ ఐరోపా దేశాలను చేరుకోవాలనేది ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా చైనా వ్యూహాత్మకంగా తన వివిధ మిలిటరీ స్థావరాలను సముద్రంలో వుండే వివిధ దీవులలో ఏర్పాటు చేసుకున్నారు.

భారత దేశంతో సత్సంబంధాలు కలిగివున్న శ్రీలంక, మయన్మార్, బాంగ్లాదేశ్ దేశాలలో కూడా చైనా తన ఆర్థిక బలంతో ఓడరేవులను నిర్మిస్తుంది. శ్రీలంకలోని హంబన్ తోట, మయన్మార్ లోని సిత్వే, బాంగ్లాదేశ్ లోని చిట్టగాంగ్ ఓడరేవులు చైనా నిర్మిస్తున్నవి. వీటితో పాటుగా, పాకిస్తాన్ లోని గ్వాదర్ పోర్ట్, టాంజానియా, నమీబియా, ఘానా దేశాల్లో కూడా ఇలాంటి ఓడరేవులు చైనా నిర్మిస్తున్నది. ఈ విధంగా చైనా తన ఆర్థిక బలంతో వివిధ దేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే.., ఆయా దేశాల్లో రవాణా వ్యవస్థను సులభతరం చేయడం ద్వారా పారిశ్రామిక రంగంలో అభివృద్ధి గణనీయంగా పెరుగుతుంది. ఈ విధంగా చైనా తన లక్ష్యాన్ని 2049 వరకు పూర్తి చేయాలనే ప్రణాళిక వేసుకుంది. 2049 వరకు చైనా కమ్యూనిస్ట్ పాలనకు వంద సంవత్సరాలు నిండుతాయి. అప్పటికీ ప్రపంచంలోనే చైనా నంబర్ వన్ గా ఉండాలనేది ఆ ప్రభుత్వ ఆశయం, లక్ష్యం.

చైనా ఈ భారీ ప్రాజెక్టును చేపట్టి విజయవంతంగా ముందుకు వెళుతున్న సమయంలో అగ్ర రాజ్యమైన అమెరికా కూడా బ్లూ డాట్ నెట్ వర్క్ పేరుతో.. వివిధ దేశాల్లో తమ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసింది. చైనా చేపట్టిన వన్ బెల్ట్–వన్ రోడ్ ప్రణాళికను భారతదేశం మొదటి నుండి వ్యతిరేకిస్తున్నది. కాగా ఈ ప్రాజెక్టులో చేరాలని భారత్‌పై చైనా ఒత్తిడి తెస్తున్నది. ఇదే సమయంలో భారత్ కూడ తన వ్యూహాలను రచించడం మొదలు పెట్టింది. హిందూ మహాసముద్రంలో భారత్ కూడా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి మాల్దీవ్స్, ఒమన్, సోమాలియా, పశ్చిమ ఆసియాలోని సేయరా లియోన్, టోగో దేశాలతో నూతనంగా సత్సంబంధాలను ఏర్పాటు చేసుకుంది. ఇరాన్ దేశలోని చాబహార్ ఓడరేవును భారత్ నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా పాకిస్తాన్ చైనా దేశాలను ఒంటరిగా చేస్తూ.., ఆఫ్ఘనిస్తాన్, సెంట్రల్ ఆసియా దేశాల గుండా మాస్కో వరకు నార్త్, సౌత్ ట్రాన్సిట్ క్యారిడార్ (ఎన్ఎస్‌టిసి) ని భారత్ నిర్మిస్తున్నది. దీని ద్వారా సెంట్రల్ ఆసియా, ఆఫ్ఘన్ దేశాలకు సముద్ర మార్గం సులభతరమవుతుంది. దీంతో భారతదేశానికి సముద్ర రవాణా వ్యవస్థ బలపడుతుంది. ఈ విధంగా ప్రపంచంలో ఆర్థిక పోటీ నెలకొంది. చైనా తన లక్ష్యాన్ని సాధించుకోవడానికి 600 లక్షల కోట్లు వ్యయం చేస్తూ ఈ భారీ ప్రాజెక్టును చేపట్టింది. భారత్ కూడా నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పైప్ లైన్ (ఎన్ .ఐ.పి) పేరిట 102 లక్షల కోట్ల వ్యయంతో 2025 వరకు భారత్ లోని వివిధ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, రవాణా వ్యవస్థ అభివృద్ధి వలన 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీ లక్ష్యాన్ని సాధించడానికి మార్గం ఏర్పాటు చేసుకుంటున్నది.

### ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు తీసిన

# లోన్ యాప్ రుణం!

- లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక విద్యార్థి ఆత్మహత్య
- ఇంట్లో తెలియకుండా లోన్ యాప్‌లో రూ. 10వేలు రుణం తీసుకున్న వంశీ
- రూ. 1లక్ష కట్టాలంటూ యాప్ నిర్వాహకుల వేధింపులు
- తాడేపల్లిలో కృష్ణా నదిలో దూకి ప్రాణాలు తీసుకున్న వైనం



**విశ్వంభర, విజయవాడ :** లోన్ యాప్‌లో అప్పు తీసుకోవడం ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు తీసింది. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని విజయవాడకు చెందిన మురికింటి వంశీ (22) ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అవసరం ఉండడంతో ఇంట్లో తెలియకుండా ఓ లోన్ యాప్‌లో రూ. 10 వేలు రుణం తీసుకున్నాడు. అయితే యాప్ నిర్వాహకులు అతడిని రూ. 1లక్ష కట్టాలంటూ వేధింపులకు గురిచేశారు. ఈ విషయం ఇంట్లో చెప్పడానికి భయపడిన వంశీ ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం తాను చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు సందేశం పంపాడు. ఆ తర్వాత నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఆందోళన చెందిన కుటుంబీకులు రెండు రోజులుగా వంశీ కోసం గాలించారు. ఈ క్రమంలో తాడేపల్లిలో కృష్ణా నది వద్ద అతని మొబైల్ ఫోన్, బైక్, చెప్పులను గుర్తించారు. దాంతో నదిలో గాలింపు చేపట్టగా వంశీ మృతదేహం దొరికింది. తండ్రి ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## జిలుగ విత్తనాల కోసం రైతుల పడిగాపులు


**విశ్వంభర, మెట్పల్లి మే 26 :** వానకాలం సమీపిస్తున్న తరుణంలో విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుంది. వరి పంటలు వేసే ముందు భూసారం పెంపునకు పచ్చిరొట్ట (జీలుగ) విత్తనాలు ఎంతో అవసరం. కానీ, ఇవి కావాలంటే రైతులు వేకువజామున నుండే కార్యాలయం ఎదుట గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయానికి ఇటీవలే జీలుగ విత్తనాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న ముత్యంపేట, రాఘవపేట, హుస్సేన్నగర్, సిరిపూర్ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం వాటి కోసం కోసం కార్యాలయం ఎదుట బారులు తీరారు. వచ్చిన 400 సంచులు కేవలం రెండు గంటల సమయం లోనే అయిపోవడంతో మిగిలిన రైతులు విత్తనాలు దొరకక నిరాశతో వెనుదిరిగారు.




## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై ఎమ్మెల్యే సంజయ్ ఫైర్

**విశ్వంభర, మెట్పల్లి మే 26 :** కోరుట్ల నియోజకవర్గంలోని మెట్పల్లి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మతి భ్రమించింది, తాను ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. మొన్న జరిగిన ఎలక్షన్ లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనని మాట్లాడిన జీవన్ రెడ్డి బీజేపి ఎమ్మెల్యే అరవిందుకు మద్దతు తెలిపింది నిజంకాద అని కోరుట్ల ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా చేసింది ఏమీ లేదని ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గౌరవం లేకుండా వాడు వీడు అని సంబోధించడం ఎంత వరకు సబబని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాత, ఎంపీపీ సాయిరెడ్డి ఉన్నారు.

## ఏసీ లేదని థియేటర్ యాజమాన్యానికి ఫైన్



**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** ఖైరతాబాద్‌కు చెందిన నేరోళ్ల నిష్పర్ అనే వ్యక్తి గతేడాది ఏప్రిల్ 28న అబిడ్స్‌లోని 'ముక్త ఏ2 సినిమాస్' థియేటర్‌కు వెళ్లారు. అక్కడ 'కిసీ కా భాయ్.. కిసీ కా జాన్' సినిమా చూశాడు. తన బైక్ పార్కింగ్‌కు రూ.20 ఫీజు, సినిమా టికెట్‌కు రూ.150 కట్టారు. థియేటర్‌లో ఏసీలు ఉన్నా.. అవి పని చేయలేదు. దీంతో ఆయన తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇంటర్వెల్ సమయంలో ఈ సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకొని వెళ్లాడు. కానీ.. వారిని నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు. సమస్య పరిష్కరించకపోగా నేరోళ్ల నిష్పర్‌పై అక్కడి సిబ్బంది దుర్భాషలాడి దురుసుగా ప్రవర్తించారని బాధితుడు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. తెలంగాణ సినిమాస్ చట్టం- 1955 ప్రకారం రూ. 110 ఉండాల్సిన టికెట్ ధరను రూ.150కు పెంచి అమ్ముతున్నారని ఆరోపించారు. దీంతో.. వినియోగదారుల కమిషన్ థియేటర్ యాజమాన్యానికి నోటీసులు పంపింది. కానీ.. ఫిర్యాదుదారుడి ఆరోపణల్లో నిజం లేదని వాదించింది. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత నేరోళ్ల నిష్పర్‌కు టికెట్ డబ్బు రీ ఫండ్ చేసి రూ.3000 నగదు ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది.

# రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- దర్శనానికి 6 గంటల సమయం
- వేసవి నేపథ్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ
- భక్తులకు సకల ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఇంచార్జ్ ఈవో రామకృష్ణ



**విశ్వంభర, వేములవాడ :** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుతుండటంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతికరమైన సోమవారం కావడంతో తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఈ క్రమంలో స్వామివారి దర్శనానికి సుమారు 6గంటల సమయం పడుతునట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల అధిక రద్దీ దృష్ట్యా ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

**క్యూలైన్లలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ**

అధిక రద్దీకి తోడు వేసవి నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు చల్లని తాగునీరుతో పాటు 5వేల మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచి భక్తులకు అందజేస్తున్నారు. మరోవైపు భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వయంగా ఇంచార్జ్ ఈ.వో రామకృష్ణనే రంగంలోకి దిగారు. ఆలయ పరిసరాలన్ని కలియతిరుగుతూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్ల దగ్గరికి వెళ్లి భక్తులతో మాట్లాడారు. అక్కడ వేచి ఉన్న భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

## వారం రోజులు బెయిల్ పొడిగించాలి

### సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్



**విశ్వంభర, ఢిల్లీ మే 27:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ లిక్కర్ స్కాం కేసు వీడటంలేదు. ఈ క్రమంలో ఆయన పలు ఆరోగ్య కారణాలను చూపుతూ బెయిల్ పొడిగింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జూన్ 1 వరకు సుప్రీం కేజ్రీవాల్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. తన తీవ్ర ఆరోగ్య సమస్యలను వివరిస్తూ వైద్య పరీక్షలు చేయించుకోవడానికి 7 రోజులు బెయిల్ మంజూరు చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఢిల్లీలోని మ్యాక్స్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కేజ్రీవాల్ కు ప్రాథమిక పరీక్షలు పూర్తయ్యాయని, మరి కొన్ని వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని వైద్య బృందం పేర్కొన్నది. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసినదే.



## జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు ?


**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు, ఇప్పుడు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ముగిశాయి.. ఇప్పుడు అందరి దృష్టి స్థానిక సంస్థల ఎన్నికలపై పడింది. అయితే.. ప్రభుత్వం జూలైలో నిర్వహించాలని మొదట భావించింది. కానీ.. ప్రభుత్వ వర్గాల నుంచి వస్తున్న సమాచారాన్ని బట్టి ఈ ఎన్నికలు వచ్చే ఏడాది జనవరిలో జరిగేలా ఉన్నాయి. దీనికి బలమైన కారణం బీసీల రిజర్వేషన్లు. బీసీ రిజర్వేషన్ ఖరారు కాకుండా, ఎన్నికలు వెళ్లొద్దని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. బీసీ కులగణన, రిజర్వేషన్లను ఫైనల్ చేయడానికి కనీసం నాలుగైదు నెలల సమయం పడుతుంది. దీంతో.. జనవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జనవరిలో పంచాయతీ ఎన్నికలు ఆ వెంటనే మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈలోపు బీసీ జనాభా లెక్కింపు, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ కులగణన చేపట్టి, స్థానిక సంస్థల్లో వారి రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

## ఏపీలో వివిధ రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృతి

**విశ్వంభర, విజయవాడ మే 27 :** ఆంధ్రప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ఏపీలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. తిరుపతి జిల్లా చంద్రగిరిలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నెల్లూరు నుంచి వేలూరుకు వెళుతుండగా ఓ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మరోవైపు కృష్ణా జిల్లా బాపులపాడులో చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపు వెళ్తున్న లారీపైకి దూసుకెళ్లింది. కొవ్వూరు నుంచి తమిళనాడు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారులు ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉంది. చంద్రగిరి మండలంలో మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సి.మల్లవరం జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత అవతలి వైపు రోడ్డుకు దూసుకెళ్లింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. కారులోని ఇద్దరు ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

## ప్రజాసేవలో ఎర్రోళ్ల రాఘవేందర్

**విశ్వంభర, ఆమనగల్లు మే27:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గ్రామానికి చెందిన నార్లకంటి మల్లేష్ కుమార్తె కల్పన శనివారం మోయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేధిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ చేవెళ్ల దవాఖానలో వున్న బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపి, వారి కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటూ.. వారికి అండగా ఉంటామని తెలియజేసి వారికి రూ.3000 సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల కురుమ సంఘం అధ్యక్షుడు నార్లకంటి లక్ష్మీ నారాయణ, వరికుప్పల మహేష్, నార్లకంటి చంద్ర శేఖర్,




గోరటి గణేష్, నార్లకంటి మల్లేష్, గండికోట నర్సింహ తదితరులు పాల్గొన్నారు.




### మరో రెండు సెల్ టవర్స్ తగలపెట్టిన మావోలు

**విశ్వంభర, భద్రాచలం :** ఛత్తీస్ ఘడ్, నారాయణ్ పూర్ జిల్లా చోటే డోన్ గార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చమేలిగౌర్ దండ గ్రామాల్లో రెండు మొబైల్ సెల్ టవర్‌లను మావోయిస్టులు తగలపెట్టారు. ఆదివారం బంద్ సందర్భంగా బీజపూర్ జిల్లాలో రెండు సెల్ టవర్స్ తగలపెట్టగా, సోమవారం నారాయణపూర్ జిల్లాలో మరో రెండు టవర్స్ తగల పెట్టడంతో ఆ ప్రాంతాల్లో సమాచార వ్యవస్థ నిలిచిపోయింది. సంఘటన ప్రాంతంలో బూటకపు ఎన్ కౌంటర్ లకు నిరసనగా ఈ చర్యలు చేపడుతున్నట్లు మావోయిస్టులు బ్యానర్స్ కట్టారు.



### అమానుషం మురికి కాలువలో పసికందు మృతదేహం

**విశ్వంభర, మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ ప్రధాన మురికి కాలువలో ఓ పసికందు కొట్టుకు రావడం స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం దగ్గరలో ప్రధాన మురికి కాలువలో పసికందు మృతదేహం లభ్యమైంది. అవాంఛిత గర్భంతోనే మురికి కాలువలో పడేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాలువ ప్రధాన మురికి కాలువ కావడంతో ఎక్కడ నుంచి కొట్టుకొచ్చింది అనేది తెలియాల్సి ఉంది.



### అమెరికాలో యాదగిరిగుట్ట యువతి మృతి

**విశ్వంభర, యాదగిరిగుట్ట :** ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన గుంటపల్లి కోటేశ్వరరావు, గుంటపల్లి బాలమణిల కూతురు గుంటపల్లి సౌమ్య (24) ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లింది. అయితే ఆదివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో అతి వేగంగా వచ్చిన ఒక కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అమెరికాలో చదువుతోపాటు పార్ట్ టైం జాబ్ కూడా చేస్తుందని యాదగిరిపల్లి గ్రామ ప్రజలు తెలిపారు. ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థాయికి ఎదుగుతుందనుకున్న యువతి మృతి చెందడంతో సౌమ్య తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. సౌమ్య మృతిపట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. సౌమ్య మృతదేహాన్ని అమెరికా నుంచి తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తానని చెప్పారు.

# నాసిక్‌లో ఏఐఎంఐఎం నేతపై కాల్పులు



**విశ్వంభర, నాసిక్ :** ఏఐఎంఐఎం నేత, మాలేగావ్ మాజీ మేయర్.. అబ్దుల్ మాలిక్ మహమ్మద్ యూనిస్‌పై సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయనకు మూడు తూటాలు తగిలినట్లు సమాచారం. వెంటనే మాలిక్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్సను అందించారు. ఛాతి ఎడమ భాగం, కుడి తొడ, కుడి చేయికి గాయాలయ్యాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఆయన్ను నాసిక్‌లో మరో వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మహారాష్ట్ర ఎంఐఎం శాఖలో అబ్దుల్ ప్రముఖ నాయకుడు. సోమవారం తెల్లవారు జామున 1.20 సమయంలో ఓల్డ్ ఆగ్ర రోడ్డులోని ఒక రెస్టారంట్ ఎదుట మాలిక్ కూర్చొని ఉండగా ఈ దాడి జరిగినట్లు నాసిక్ పోలీసులు తెలిపారు. నిందితుల కోసం ఇప్పటికే గాలింపు చర్యలు చేపట్టారు. నగరంలో వేసవి తీవ్రతకు స్థానికులు అర్ధరాత్రి కూడా మెలకువగానే ఉంటున్నట్లు తెలుస్తోంది.

# మాజీ మంత్రి ఎర్నేని సీతాదేవి కన్నుమూత



**విశ్వంభర, హైదరాబాద్ మే 27 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ ఎర్నేని సీతాదేవి సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపై పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం తెలుపుతు న్నారు. సీతాదేవి స్వస్థలం ఏపీలోని కైకలూరు మండలం కోడూరు. ముదినేపల్లి నుంచి టీడీపీ తరఫున ఆమె రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. ఆ తర్వాత ఆమె బీజేపీలో చేరారు. యెర్నేని సీతాదేవిది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. ఆమె భర్త నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య, కొల్లేరు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా, కృష్ణా, గోదావరి, పెన్నార్ డెల్టా డ్రెయినేజీ బోర్డు సభ్యుడిగా పని చేశారు. కిందటి ఏడాదే ఆయన కన్నుమూశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



# తెలుగు రాష్ట్రాలకు తప్పిన ముప్పు..

## తీరం దాటిన రెమాల్

**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** తెలుగు రాష్ట్రాలకు రెమాల్ తుఫాన్ ముప్పు తప్పింది. ఎట్టకేలకు బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య రెమాల్ తుఫాన్ తీరం దాటింది. అంతేకాదు.. ఈశాన్య దిశలో రెమాల్ తుఫాన్ బలహీపడుతోంది. బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలకు వాతావరణ శాక హై అలర్ట్ ప్రకటించింది. మత్స్యకారులు ఎవరూ కూడా వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాలకు తుఫాన్ ముప్పు తప్పినా వర్ష సూచనల కనిపిస్తున్నాయి. ఏపీలో పశ్చిమ దిశ నుంచి బలమైన గాలలు వీస్తున్నాయి. దీంతో ఏపీలోని పలుచోట్ల ఈదురుగాలలుతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇక తుఫాన్ ప్రభావం ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. రెండు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రతమయ్యాయి. లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తుఫాన్ హెచ్చరికలతో పలు విమానాలు, రైళ్ల సర్వీసులు రద్దయ్యాయి. ఇక బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా అలర్ట్ అయింది. బంగ్లాదేశ్ పోర్టులో నేవీ అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

## తెలంగాణలో వర్షం బీభత్సం

తెలంగాణలో నిన్న వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వానతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం, ప్రాణ నష్టం వాటిల్లింది. పలు జిల్లాలో వేరువేరు ఘటనల్లో 14 మంది మృతి చెందారు. నాగర్ కర్నూల్‌లో 8 మంది, హైదరాబాద్‌లో నలుగురు, మెదక్ జిల్లాలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

# టంగుటూరు ప్రకాశం పంతులు మనవడి కన్నుమూత



**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు మనవడు గోపాల కృష్ణ (64) హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు సమాచారం. ప్రకాశం పంతులుకు ఇద్దరు కుమారులు కాగా హనుమంతరావు కుమారుడు గోపాలకృష్ణ సోమవారం వేకువ జామున కన్నుమూశారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# యుద్ధ ట్యాంకుల రేసులో భారత్ విజయం



**విశ్వంభర, ఢిల్లీ:** రష్యాలో జరిగిన మిలిటరీ యుద్ధ ట్యాంకుల రేసులో భారత్ ఘన విజయం సాధించింది. ఈ రేసులో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ పోటీల్లో ఇండియన్ ఆర్మీకి చెందిన డ్రైవర్ మన్‌దీప్‌సింగ్ 50 టన్నుల బరువున్న యుద్ధ ట్యాంకుతో దూసుకెళ్లి రేసులో అలవోకగా విజయం సాధించారు. భారత జాతీయ జెండా రెపరెపలాడుతుండగా యుద్ధ ట్యాంకు దూసుకెళుతున్న వీడియోను బ్రిగేడియర్ హర్దీప్‌సింగ్‌సోహి తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో సోమవారం పోస్టు చేశారు. ఈ ట్వీట్‌కు ఇండియన్ ఆర్మీ ట్యాగ్‌ను జత చేశారు. ఈ విజయానికిగాను ట్యాంకు డ్రైవర్ మన్‌దీప్‌సింగ్‌పై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# కోర్టులోనే కన్నీళ్లు పెట్టుకున్న స్వాతి మలివాల్




**విశ్వంభర, ఢిల్లీ :** రాజ్యసభ ఎంపీ, ఆప్ నేత స్వాతి మలివాల్‌పై వేధింపులు, దాడి కేసును సోమవారం ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టు విచారణ జరిపింది. ఈ కేసులో అరెస్టు చేసిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ కుమార్‌కు కోర్టు నాలుగు రోజుల కస్టడీ విధించిన విషయం తెలిసిందే. స్వాతి తనకు తానే గాయపరుచుకుందేమోనని బిభవ్ తరఫు న్యాయవాది హరిహరన్ వాదించారు. ఆమెపై దాడి చేయాలని లేదా వేరే ఏ ఇతర ఉద్దేశం బిభవ్‌కు లేదని ఆయన కోర్టులో తెలిపారు. అనేక మంది ఉండే సీఎం నివాసంలో దాడి జరిగే అవకాశం ఉండదని, బిభవ్‌కు బెయిల్ ఇవ్వాలని కోరారు. విచారణ జరుగుతుండగా స్వాతి మలీవాల్ భావోద్వేగానికి గురయ్యారు. లాయర్ వాదనలతో కోర్టులోనే ఉన్న స్వాతి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆదివారంతో కస్టడీ గడువు ముగియడంతో సోమవారం బిభవ్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరుగుతుండగా ఓ మహిళా కానిస్టేబుల్ స్పృహ కోల్పోవడంతో కోర్టులో కలకలం రేగింది. ఢిల్లీలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండ తీవ్రతకు కానిస్టేబుల్ స్పృహ కోల్పోయినట్లు సమాచారం. ఈ నెల 18న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ నివాసంలో తనపై దాడి జరిగిందని ఎంపీ స్వాతి మలీవాల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

# సముద్రంలో అనంత్ అంబానీ-రాధిక ప్రీ వెడ్డింగ్ వేడుకలు



**విశ్వంభర, ముంబై :** అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలు మొదలయ్యాయి. ఓ లగ్జరీ నౌకలో మూడు రోజులపాటు వేడుకలు కొనసాగనున్నాయి. ఈ నెల 28 నుంచి 30 వరకు ఇటలీ నుంచి ఫ్రాన్స్ వరకు 4,380 కి.మీ మేర క్రూయిజ్ షిప్ ప్రయాణించనుంది. మొత్తం 800 మంది అతిథుల్లో సల్మాన్ ఖాన్, షారుఖ్, ఆమీర్, రణ్‌బీర్, ధోనీ వంటి సెలబ్రిటీలు ఉండనున్నారు. వీరందరికీ సేవలు అందించేందుకు 600 మంది సిబ్బంది ఉన్నారు. ఈ పార్టీకి భారీగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. జూలై 6 నుంచి 12 మధ్య ముంబైలో పెళ్లి జరగనుంది. కాగా, ఈ ఏడాది మార్చిలో గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో వీరిద్దరి ప్రీ వెడ్డింగ్ వేడుక జరిగింది. మే 29, బుధవారం రోజున వెల్‌కమ్ లంచ్‌తో వేడుక ప్రారంభం కానుంది. డ్రెస్‌కోడ్ క్లాసిక్ క్రూయిజ్. ఆ తరువాత 'స్టార్రీ నైట్' థీమ్ ఈవెంట్ జరుగుతుంది. దీనికి డ్రెస్ కోడ్ వెస్ట్రన్ ఫార్మల్స్ ఉంటుంది. ఇక మే 30, గురువారం రోజున అతిథులందరూ రోమ్‌లో దిగుతారు. అప్పుడు టూరిస్ట్ చిక్ డ్రెస్ ధరించాల్సి ఉంటుంది. సాయంత్రం 'టోగా పార్టీ'తో రెండో రోజు ముగుస్తుంది. మే 31, శుక్రవారం రోజున థీమ్ 'వీ టర్న్ వన్ అండర్ ది సన్', 'లే మాస్క్వేరేడ్' అండ్ పార్డన్ మై ఫ్రెంచ్'. ఇది క్రూయిజ్‌లో తర్వాత పార్టీతో ముగుస్తుంది. చివరి రోజైన జూన్ 1 శనివారం రోజున థీమ్ 'లా డోల్స్ వీటా'. అతిథులు ఇటాలియన్ సమ్మర్ డ్రెస్ కోడ్‌ను పాటించాల్సి ఉంటుంది.

# హాలీవుడ్ నటుడిని కాల్చి చంపిన దుండగులు



**విశ్వంభర, లాస్ ఏంజెల్స్ :** అమెరికాలో దుండగులు మరోసారి రెచ్చిపోయారు. ప్రముఖ హాలీవుడ్ నటుడు జానీ వాక్టర్ (37)ను దుండగులు కాల్చి చంపారు. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో కారులో వెళ్తుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వాక్టర్ కారు వద్ద కాటలిక్ట్ కన్వర్టర్‌ను దొంగిలిస్తుండగా ఎదురుతిరిగిన అతనిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ వాక్టర్ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వాక్టర్ తల్లి స్కార్లెట్ వెల్లడించారు. ఈ ఘటన జరిగిన వెంటనే నిందితులు అక్కడి నుంచి పారిపోగా పోలీసులు వారి కోసం వెతుకుతున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి అరెస్టులు జరగలేదని తెలిపారు. 2007లో ఆర్మీ వైవ్స్ అనే టీవీ షోతో కెరీర్ ప్రారంభించిన వాక్టర్.. జనరల్ హాస్పిటల్ అనే షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. దాదాపు 200 ఎపిసోడ్స్‌లో నటించారు. వెస్ట్‌వరల్డ్, ది ఓ, స్టేషన్ 19, క్రిమినల్ మైండ్స్, హాలీవుడ్ గర్ల్ వంటి విజయవంతమైన వెబ్ సిరీస్‌లు, పలు టీవీ షోలలో నటించారు.

## పిన్నెల్లికి ముందస్తు బెయిల్



**విశ్వంభర, మాచర్ల :** వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి బిగ్ రిలీఫ్ లభించింది. ఈవీఎం ధ్వంసం చేసిన కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మే 13న ఏపీలో ఎన్నికలు జరిగిన సమయంలో మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన పిన్నెల్లి.. ఈవీఎం మెషిన్‌ను ధ్వంసం చేశారు. ఈ కేసుతో పాటు పోలింగ్ తర్వాత జరిగిన మూడు ఘటనల్లోనూ తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిన్నెల్లి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం పిన్నెల్లికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# హైదరాబాద్ రియల్టర్ దారుణహత్య

**విశ్వంభర, జీడిమెట్ల:** హైదరాబాద్ జీడిమెట్లలో దారుణ హత్య జరిగింది. ఈనెల 24న నమోదైన మిస్సింగ్ కేసు చివరికి మర్డర్ కేసుగా మారింది. ఈ నెల 24న రియల్టర్ కుప్పం మధు మిస్ అయ్యినట్టు కుటుంబ సభ్యులు పోలీస్ ఫిర్యాదు చేశారు. బాధితులకు ఫిర్యాదు మేరకు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులకు ఆయన హత్యకు గురైనట్టు తెలిసింది. చింతల్ వద్ద అదృశ్యమైన ఆయన కర్నాటక రాష్ట్రంలోని బీదర్ దగ్గర శవమై కనిపించారు. కుప్పం మధు ప్రత్యర్థులు ఆయనను అత్యంత దారుణంగా హతమార్చారు. ఏకంగా పెద్ద బండరాయితో మోది కత్తితో పొడిచారు. హత్య చేసిన తర్వాత నిందితులు మధు మృతదేహాన్ని అక్కడే వదిలి వెళ్లారు. డెడ్ బాడీని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో.. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని, హత్య జరిగిన విధానాన్ని పరిశీలించారు. కిడ్నాప్ చేసిన వారే మధును హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమాని స్తున్నారు. మధు మిస్ అయిన రోజు ఆయన తో పాటు.. రూ.5 లక్షల నగదు పట్టుకొని వెళ్లారు. అంతేకాదు ఆయన ఒంటిపై బంగారం కూడా ఆరోజు ఉంటేది. అవి అన్ని ఇప్పుడు మిస్ అయ్యాయి. దీంతో.. ఆర్థిక లావాదేవీల కారణంగానే ఈ హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య కేసుగా ఫైల్ చేసి విచారణ చేస్తున్నారు.



– మాధవశేషు స్వామి, వాస్తు, జ్యోతిష్యం పురోహిత్, సెల్: 9059308808

# రాశి ఫలాలు

**26-05-2024 నుండి 01-06-2024 వరకు**

**మేష రాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడలేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకు కల్గించును. నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.

**వృషభ రాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసటగా ఉండును. కుటుంబ విషయాలలో ఆర్థికంగా ఆలోచించి ముందుకు సాగుతారు. పుత్రా సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం ఇతరులకు డబ్బు ఇవ్వరాదు. ఇచ్చినచో తిరిగిరావు.

**మిథున :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారం ప్రారంభానికి ఆలోచిస్తారు. భార్య ఆరోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన విలువైన కాగితాలు, డబ్బులు మరచిపోగలరు. బంధు వర్గం వారితో జాగ్రత్త అవసరం. విరోధాలు ఉండును.

**కర్కాటక :** విశేష యోగవంతంగా ఉంది. తలచిన వెంటనే పనులు పూర్తగును. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగవంతంగా ఉండును. స్వంత ఆలోచనతో వ్యాపారం చేయుట మంచిది. శుభ వార్తలు వింటారు.

**సింహరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడును. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడిననూ వారం చివరిలో శుభం కల్గును.

**కన్యారాశి :** అనుకూలంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. నిరుద్యోగులకు ఉద్యోగం ప్రాప్తించును. పుత్ర సంతానంతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. డబ్బు ఖర్చు అధికంగా ఉండును.

**తులరాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని కలిగి ఉందురు. సంతానం ద్వారా ధన నష్టం కల్గును. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉండును.

**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్ననూ, అనుకున్న కోర్కెలు నెరవేరును. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు మేరుగుపడును. శారీరక శ్రమ అధికం కావటం వల్ల శిరో బాధలు ఏర్పడును.

**ధనుస్సురాశి :** గడ్డుకాలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి మూడు సార్లు తిరగవలసి వస్తుంది. వాహనం నడపడంలో జాగ్రత్త అవసరం.

**మకరరాశి :** శ్రమకు తగిన ఫలితాన్ని సాధిస్తారు. స్నేహితులతో విరోధాలు, అకాల భోజనం, సోదర విరోధం, మాట విలువ తగ్గును. ఆర్థిక విషయాలు చికాకు కలిగిస్తాయి. కోర్టు వివాదం ఒక కొలిక్కి వస్తుంది.

**కుంభరాశి :** రాజయోగంగా ఉన్నది. వ్యాపారాభివృద్ధి చెందుతారు. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయల్లో జాగ్రత్త అవసరం. కొంత చికాకుగా ఉన్ననూ వారం చివరి వరకు అన్ని పనులు పూర్తి అగును. సోదర, బంధు వర్గం వారికి విశేష సహకారం అందించగలరు.

**మీనరాశి :** విశేషంగా ఉన్నదని చెప్పొచ్చు. కార్య దీక్షతో అన్ని పనులు పూర్తి చేస్తారు. ద్రవ్యం నిల్వ చేస్తారు. స్నేహితులతో విహారయాత్రలు చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.

# మే 31న సిట్ ముందు హాజరవుతా

**ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ**



**విశ్వంభర, బెంగళూరు:** లైంగిక దౌర్జన్యాలకు పాల్పడి, విదేశాలకు పారిపోయిన జేడీ (ఎస్) నేత, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తొలిసారిగా స్పందించారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రత్యేక దర్యాప్తు బృందం ముందు హాజరు కానున్నట్లు ఒక వీడియోను విడుదల చేశాడు. ఏప్రిల్ 26న జరిగిన కర్ణాటక లోక్ సభ ఎన్నికల ముందు ప్రజ్వల్ రేవణ్ణ పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీయడంతో విదేశాలకు పారిపోయాడు. అప్పటి నుంచి భారత్ కు తిరిగిరాలేదు. తాజా గా దర్యాప్తు సంస్థ సిట్ ముందు విచారణకు హాజరవుతానంటూ వీడియో రిలీజ్ చేశాడు. తనపై వచ్చిన ఆరోపణలతో తాను డిప్రెషన్ లోకి వెళ్లిపోయినట్లు చెప్పాడు. ఇదే సమయం ఓ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు వ్యాఖ్యలు పొలిటికల్ డ్రామా అని ఆరోపించాడు. "నేను నా శక్తి మేరకు సహకరిస్తాను. అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్తాను. న్యాయ వ్యవస్థపై నాకు పూర్తి నమ్మకం ఉంది. నాపై ఉన్న ఈ తప్పుడు కేసుల నుంచి బయటకు వస్తాను. నాకు భగవంతుడు, నా కుటుంబ ఆశీర్వాదం" ఉందన్నారు.

# అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ

- పెరిగిన నిరుద్యోగం, ద్రవ్యోల్బానానికి బీజేపీ మూల్యం చెల్లించుకుంటుంది
- అగ్ని వీర్ పథకాన్ని రద్దు చేస్తాం
- బిలియనీర్లకు మోడీ రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్ట్‌లు కేటాయించి దేశం పరువు తీశారు
- చైనా దురాక్రమణ పై మోడీ మౌనం దేనికి సంకేతం
- పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు హామీ ఇచ్చారు. సోమవారం పంజాబ్ రాష్ట్రం ఫరీద్ కోట్ లోక్ సభ పరిధిలోని కోటక్ పుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఒక కమిషన్ ఏర్పాటు చేస్తుందని, రైతులకు రుణమాఫీ అవసరమైన ప్రతిసారి ఆ కమిటీ ప్రభుత్వానికి తెలియజేస్తుందని మేము కమిటీ సిఫారసులను అమలు చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అగ్ని వీర్ స్కీంను రద్దు చేస్తుందని తెలిపారు. మోడీ భారత సైనికులను కార్మికులుగా మార్చి రెండు రకాల అమరవీరులను సృష్టించారని విమర్శించారు. అమరవీరుల హోదా, పెన్షన్ తో పాటు అన్ని సౌకర్యాలు పొందే వారు ఒకరైతే, పేద కుటుంబాల యువతకు మాత్రం ఇలాంటి గౌరవాలు, సౌకర్యాలు లేకుండా వివాదాస్పద పథకాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అగ్ని వీర్ పథకం సైన్యం ఆలోచన కాదని ఇది మోడీ కుట్రపూరిత పథకమని విమర్శించారు. ప్రభుత్వాన్ని బిలియనీర్ లైన అదాని, అంబానీలు నడుపుతున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు ప్రధాని అదాని గ్రూపులకు విక్రయించి మోడీ తన పరువు పోగొట్టుకున్నారని, ఈ దేశం పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పెరిగిపోయిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి పరిస్థితులకు బీజేపీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఒక పెద్ద మార్పు తీసుకురాబోతున్నారని తెలిపారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణ చూసి మోడీ తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆ క్రమంలో విపక్షాలపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలవేళ గత 10 ఏళ్లలో చేసిన అభివృద్ధి పనులు చెప్పుకోవాల్సిన ప్రధాని మోడీ మతం, మంగళసూత్రం, ముజ్రా వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం, ఆయన ప్రధాని పదవికున్న గౌరవాన్ని తగ్గిస్తున్నారని అన్నారు. పాకిస్తాన్ తో పోరాడి బంగ్లాదేశ్ కు స్వతంత్రం తెచ్చిపెట్టాం. చైనా మన భూమిని ఆక్రమించి ఇల్లు, రోడ్లు నిర్మిస్తున్న ప్రధాని మోడీ మౌనంగా ఉండడం దేనికి సూచిక అని ప్రశ్నించారు.

# ఢిల్లీకి ముడుపులు మోస్తున్న సీఎం

**మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**



**విశ్వంభర, నాంపల్లి :** బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం నాంపల్లి లోని బీజేపీ కార్యాలయంలో ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లబోతున్నారనే సమాచారం తమకు అందిందని, ఆయన ప్రయాణించే విమానాన్ని ఎన్నికల సంఘం తనిఖీ చేయాలని సంచలన డిమాండ్ చేశారు. ఢిల్లీకి ముడుపులు తరలిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. రైతుల విషయంలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీరియస్ అయ్యారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతులకు రుణమాఫీ చేసేందుకు కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ చెబుతోందని.. ఈ పేరుతో అప్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎంబీకి మించి రుణాలు తీసుకుందన్నారు. సీఎం రుణమాఫీ ఎలా చేస్తారో స్పష్టత ఇవ్వలేక పోతున్నారన్నారు.



# బీఆర్ఎస్ ఏనాడు సన్న బియ్యం ఇవ్వలేదు

**టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ సామా రామ్మోహన్ రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్ :** సివిల్ సప్లయ్ పై అవినీతి జరిగిందని బీఆర్ఎస్ బీజేపీ(బీ,బీ) పార్టీలు ఒకటే ఆరోపణలు చేస్తున్నాయని టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ సామా రామ్మోహన్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్ లో మీడియాతో ఆయన మాట్లాడుతూ 11 వందల కోట్ల కుంభకోణం జరిగిందని బీజేపీ, 600 కోట్లు అని బీఆర్ఎస్ పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. పది ఏండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు సన్న బియ్యం ఇవ్వలేదని చెప్పారు. మధ్యాహ్నం భోజనం తో పాటు అన్ని కళాశాలలో సన్న బియ్యం తో భోజనం పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజల కోసం చిత్త శుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. కేటీఆర్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై 1500కు టెండర్లు వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి కంటే గొప్పోడిని కావాలని మహేశ్వరెడ్డి చూస్తుండని అన్నారు. ఒక్క సన్న బియ్యపు గింజ కాంగ్రెస్ కొన్నట్లు మీరు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని చెప్పారు. ఇదే అంశంపై కేటీఆర్, మహేశ్వరరెడ్డిలు అమర వీరుల స్థూపం దగ్గర బహిరంగ చర్చకు రావాలని లేదంటే మీ తప్పుని ఒప్పుకొని ముక్కును నేలకు రాయాలని అన్నారు.

# ఆరేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

## కీచకుడి ఇల్లు ధ్వంసం

**విశ్వంభర, నిజామాబాద్ మే 27:** కామాంధుల దారుణాలకు అంతే లేకుండా పోతుంది. ముక్కుపచ్చలారని చిన్నారులను వదిలిపెట్టడం లేదు. ఆరేండ్ల చిన్నారిపై ఓ కామాంధులు అఘాయిత్యానికి ప్రయత్నించిన ఘటన ఆదివారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో జరిగింది. చిన్నారి కుటుంబ సభ్యులు చూడటంతో దుండగుడు పరారయ్యాడు. అయితే.. అక్కడితో వదలకుండా చిన్నారి కుటుంబ సభ్యులు ఆ కీచకుడి ఇంటికి వెళ్లి దాడి చేశారు. బాధితుల వివరాల ప్రకారం ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు తన పక్క ఇంట్లో ఉన్న చిన్నారికి చాకెట్ల ఆశ చూపించాడు. దీంతో ఆ చిన్నారి ఆ యువకుడి దగ్గరకు వెళ్లింది. తర్వాత ఆ కీచకుడు చిన్నారిపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ఇంతలోనే చిన్నారి పినతల్లి చూసి గట్టిగా కేకలు వేసింది. దీంతో.. ఆ యువకుడు పారిపోయాడు. చిన్నారి కుటుంబ సభ్యులు లైంగికదాడికి యత్నించిన యువకుడి ఇంటిపై దాడి చేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది.

# ఇప్పుడు అభివృద్ధి గుర్తుకు వచ్చిందా.!

**శ్రీకాంత్ సింగ్**

**విశ్వంభర, ఆమనగల్లు, మే 27:** గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికా రంలో ఉన్నప్పుడు గుర్తుకురాని అభివృద్ధి ఇప్పు డు పదవీకాలం ముగుస్తుండడంతో అభివృద్ధి గుర్తుకు వస్తుందా అని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్ ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో బిమర్శించారు. డివిజన్ కార్యాలయాలు అంటూ బీఆర్ఎస్ నాయకులు కొత్త రాగం ఎత్తుకున్నారని అమనగల్ మండల కాంప్లెక్స్ వ్యాపారస్తులు 10 సంవత్సరా లుగా షాపులు లేక అనేక బాధలు అనుభవించారని, ముందుగా మండల కాంప్లెక్స్ భవనాన్ని నిర్మిం చాలని తెలియజేశారు. అధికారంలో ఉన్నప్పు డు పెదవి విప్పని మీరు అభివృద్ధి గురించి మాట్లాడడం చాలా హాస్యాస్పదంగా ఉందని అన్నారు. పదవికాలం దగ్గర పడడంతో కొత్త డ్రామాలు ఆడుతున్నారని అమనగల్ ప్రజలు, మేధవులు మీ ఆటలు అన్ని గమనిస్తూనే ఉన్నారని గతంలో ఉన్న ఏ.డి, అగ్రికల్చర్ ఆఫీస్ మీ హయాంలో తరలిపోతుంటే ఏమి చేయలేని మీరు ఐదు సంవత్సరాల కాలం వృధా చేసి జనాలను మభ్య పెట్టారని దుయ్యబట్టారు. నిజంగా ఆమనగల్ అభివృద్ధి చేయాలనే సంక ల్పం ఉంటే ఆర్టీఏ ఆఫీస్ ఎందుకు తేలేకపోయారన్నారు. ఆర్డీవో ఆఫీస్ కావాలని ఎందుకు అడగలేకపోయారని, వార్డ్ నెంబర్ నుండి ముఖ్యమంత్రి వరకు మీరే ఉన్నారు కదా అప్పుడు చేయలేని మీరు ఇప్పుడు ఎలా అభివృద్ధి చేస్తారని శ్రీకాంత్ సింగ్ అన్నారు. ఈకార్యక్రమంలో నరేందర్ నాయక్, కర్ణ, మహేష్, వరికుప్పల శ్రీను, శ్రీధర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.




# ఓటేసేందుకు పోటేత్తిన పట్టభద్రులు



**విశ్వంభర, చింతపల్లి మే 27:** చింతపల్లి మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో రెండు పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ 78.83శాతంగా నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు, పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. మండలంలో మొత్తం 1465 మంది ఓటర్లకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 1169 మంది పట్టుభద్రులు తమ ఓటు హక్కును వినయోగించుకున్నట్టు ఎమ్మార్వో విజయ కుమార్ తెలిపారు. పోలింగ్ సరళిని ఆర్డీవో రాములు నాయక్ సందర్శించారు.

### రక్తం కారుతున్నా ఓటు వేయడమే తన లక్ష్యం

కిష్టరాయినిపల్లికి చెందిన బాడిగ రాజు (38) పట్టుభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి వెనకాడలేదు. బాడిగ రాజు తన ద్విచక్రవాహనంపై ఓటు వేసేందుకు చింతపల్లి మండల కేంద్రానకి వస్తున్న తరుణంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెనకడుగు వేయక ఓటుహక్కును వినియోగించుకోవాలని తను నెత్తురోడుతున్నా.. ఓటు వేశాడు.





# అందుకే తిరుమల వెళ్లడం ప్రారంభించా: జాన్వీ కపూర్

**విశ్వంభర, సినిమా :** బాలీవుడ్ యంగ్ బ్యూటీ, శ్రీదేవి కుమార్తె జాన్వీకపూర్ తరచూ తిరుమల వెళ్తుంటుంది. తన సినిమా విడుదలకు ముందు, పుట్టినరోజు, ప్రత్యేక తేదీల్లోనూ ఆమె తిరుమల స్వామివారిని దర్శించుకుంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో జాన్వీ మాట్లాడుతూ.. తిరుమలకు తరచూ వెళ్లడానికి గల కారణాన్ని వివరించింది. తనతల్లి మరణించిన తర్వాత చాలా అలవాట్లను మార్చుకున్నట్లు జాన్వీ తెలిపింది. 'అమ్మ కంటే నేనే ఎక్కువగా విశ్వసిస్తున్నా.. అమ్మ ఎప్పుడూ తిరుమల దేవుడి పేరును తలచుకుంటూ ఉండేది. షూటింగ్ గ్యాప్‌లో నారాయణ, నారాయణ అనుకుంటుండేది. ప్రతి ఏడాది పుట్టినరోజున స్వామి వారిని దర్శించుకునేది. ఆమె చనిపోయిన తర్వాత తన పుట్టినరోజుకి నేను ఆ గుడికి వెళ్లాలని నిర్ణయించుకున్నా. అమ్మ లేకుండా మొదటిసారి తిరుమల వెళ్లినప్పుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యా. అక్కడికి వెళ్లిన ప్రతిసారి ఏదో మానసిక ప్రశాంతత లభిస్తుంది. అందుకే తరచూ వెళ్తుంటాను' అని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది.

# జూనియర్ ఎన్టీఆర్‌పై నయనతార ఇంట్రెస్టింగ్ కామెంట్స్



విశ్వంభర, సినిమా : యంగ్ టైగర్ ఎన్టీఆర్ గురించి లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా ఎన్టీఆర్ పై ప్రశంసలు కురిపించింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో నయన్, తారక్ డాన్స్ గురించి క్రేజీ కామెంట్స్ చేసింది. తాను చాలా మందిని చూశానని.. డ్యాన్స్ చేయాలంటే ముందు రిహార్సల్స్ చేసి ఆ తర్వాత డాన్స్ చేస్తుంటారని తెలిపింది. అయితే తనకు తెలిసి తారక్ ఒక్కడే రిహార్సల్స్ లేకుండా కేవలం ఒక్కసారి చూసి డాన్స్ చేసేస్తాడని తెలిపింది. అది ఎలాంటి మూమెంట్ అయినా సరే తారక్ అవలీలగా చేసేస్తాడంటూ ప్రశంసలు కురించింది నయన్. ఈ కామెంట్స్ ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఎన్టీఆర్‌తో కలిసి నయన్ 'అదుర్స్' సినిమాలో హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే. ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఎన్టీఆర్ బాలీవుడ్ మూవీ వార్‌తో పాటు కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న దేవర మూవీలో నటిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వికపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# మానవ సేవే.. మాధవ సేవ

## త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామిజీ



విశ్వంభర, ఆమనగల్లు, మే 27: రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో శృతిలయ కల్చరల్ అకాడమీ మరియు వందేమాతరం ఫౌండేషన్ కలిసి దాదాపు 200 మంది పేద విద్యార్థులను చెరదీసి సంగీత నృత్య రంగాల్లో శిక్షణ శిబిరాన్ని నెల రోజులపాటు నిర్వహించారు. ఈ శిబిరం ముగింపు వేడుకలు స్థానిక బీఎన్ఆర్ గార్డెన్ లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి సంగీత నృత్యశిక్షణ ఇచ్చినటువంటి వందేమాతరం ఫౌండేషన్ శృతిలయ అకాడమీ సభ్యులను అభినందించారు. విద్యార్థులకు భవిష్యత్తును ఇచ్చే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మానవసేవే మాధవసేవ అని పిలుపునిచ్చారు. చిన్నారులు తల్లిదండ్రులను గౌరవించాలని, ధర్మాన్ని కాపాడాలని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సంగీత నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి, రాము పాల్గొన్నారు.



# వరల్డ్ బాక్సింగ్ పోటీల్లో అభినాశ్, నిశాంత్ ముందంజ

**విశ్వంభర, స్పోర్ట్స్ మే 27:** పారిస్ ఒలింపిక్స్ కోసం నిర్వహిస్తున్న వరల్డ్ బాక్సింగ్ క్వాలిఫయర్స్‌లో భారత బాక్సర్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. మూడో రోజు బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ముగిసిన 63.5 కిలోల రెండో బౌట్‌లో అభినాశ్ 5-0తో ఆండ్రీజస్ లావ్రెనోవాస్ (లిథువేనియా)ను చిత్తు చేయగా, నిషాంత్ 71 కిలోల బౌట్‌లో 5-0తో అర్మాండో బిగాఫా (గినియా బిస్సావు)పై గెలిచి ముందంజ వేశారు.



# బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

**విశ్వంభర, హైదరాబాద్ మే 27:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దశాబ్ది సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్1, 2, 3 తేదీల్లో మూడు రోజులపాటు బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరుగనున్నాయి. జూన్ ఒకటవ తేదీ సాయంత్రం 7 గంటలకు గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుండి ట్యాంక్ బండ్ వద్దగల అమర జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణ త్యాగాలు చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పిస్తారు. తెలంగాణ ఆవిర్భావ రోజు జూన్ రెండవ తేదీన తెలంగాణ ఆవిర్భావమై దశాబ్ది కాలం గడుస్తున్న నేపథ్యంలో దశాబ్ది ముగింపు వేడుకల సభను హైదరాబాద్ లోని పార్టీ కేంద్రకార్యాలయం, తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గారి అధ్యక్షతన జరుగనున్నది. ఇదే రోజు హైదరాబాద్లో పలు దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో, పార్టీ ఆధ్వర్యంలో పండ్లు స్వీట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 3 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు నిర్వహిస్తారని, ఈ సందర్భంగా పార్టీ జెండాను మరియు జాతీయ జెండాను ఎగరవేస్తార కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ను సాధించి స్వరాష్ట్రంలో తొట్టతొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలం పాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిన ఘనత గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వానిదేనని అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడులను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధినేత పిలుపునిచ్చారు. గ్రామస్థాయినుంచి రాష్ట్ర స్థాయి దాకా కార్యకర్తలు, పార్టీ అందించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అధినేత కేసీఆర్ పార్టీ కార్యకర్తలకు నేతలను కోరారు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com